



నేడే అక్షరం అండగా..

రాజమండ్రి 9వ డివిజన్‌లో నిర్వహణ

మా అక్షరం..మీ ఆయుధం.. ఇదే ఆంధ్రజ్యోతి నినాదం.. ఆ అక్షరంతోనే జనం చెంతకు వస్తోంది.. ఇప్పటి వరకూ అక్షరంతో జనగళమై ఆంధ్రజ్యోతి ప్రశ్నించింది. ఇప్పుడు స్థానిక సమస్యలపై జనవాణి వినిపించేందుకు మంగళవారం నుంచి తొలి అడుగువేస్తున్నది.. రండి..చేయి కలపండి.. సమస్యలు చెప్పండి!

రాజమహేంద్రవరం సిటీ,జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా అనే నినాదంతో మంగళవారం జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం 9వ డివిజన్ వెంకటేశ్వర నగర్ ఐఎంఏ హాలులో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు.ఆ ప్రాంత కీలక సమస్యలపై ప్రజలు..ప్రజాప్రతినిధులు.. అధి కారుల మధ్య వారధిగా ఆంధ్రజ్యోతి ఉంటుంది. దీనిలో భాగంగా ఆయా ప్రాంత సమస్యలపై చర్చిస్తారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కార్పొరేషన్ ఎస్ఈ జి.పాండురంగారావు,మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న,మాజీ కార్పొరేటర్ కోసూరి చండీప్రియ, ఈఈ, డీఈలు, శానిటేషన్ అధికారులు వార్డుకు చెందిన ముఖ్యనాయకులు హాజరవుతారు. డివిజన్ పరిధిలో ఇప్పటికే కొన్ని కీలక సమస్యలపై ప్రజలు గళం విప్పుతున్నారు.ప్రధానంగా రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, అపారిశుధ్యం తదితర 9 సమస్యలు ఉన్నాయని గుర్తించారు.మంగళవారం నిర్వహించనున్న సమావేశంలో ఆ డివిజన్‌కు చెందిన ప్రజలు వారి ప్రాంతంలో ఉన్న సమస్యలను ఆంధ్రజ్యోతి ద్వారా ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళతారు. ఆయా సమస్యల పరిష్కారంపై ప్రజాప్రతినిధులు,అధికారుల నుంచి సభావేదిక ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

గోదాట్లో దోపిడీ



కపిలేశ్వరపురం ఓపెన్ రీచ్‌లో పట్టపగలే యంత్రాలతో ఇసుక తవ్వకం

ఇసుక తవ్వేయ్..దోచెయ్



- రాత్రయినా ఆగని రవాణా
- కపిలేశ్వరపురంలో యంత్రాలు
- ధవళేశ్వరం గాయత్రీలో డ్రెడ్జింగ్
- విజ్జేశ్వరం వద్ద రాత్రి తవ్వకాలు
- రెచ్చిపోతున్న కూటమి నేతలు
- ఉచిత ఇసుక విధానానికి తూట్లు
- కన్నెత్తి చూడని అధికారులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉచిత ఇసుక విధానానికి కూటమికి చెందిన వారే తూట్లు పొడుస్తున్నారు. ఇసుకాసురులతో కుమ్మక్కై రూ.కోట్లు దోచేస్తున్నారు. అధికార యంత్రాంగం ఎంత కట్టడి చేయాలనుకున్నా ఎంత మంది మీద కేసులు పెట్టినా ర్యాంపుల కాంట్రాక్టులే రద్దు చేసినా దోపిడీ ఆగడం లేదు. గోదావరి పరీవాహక ప్రాంతం ఉన్న తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోనూ దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది.

గాయత్రిలో భారీ డ్రెడ్జింగ్

అఖండగోదావరిలో అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో భారీ డ్రెడ్జింగ్ పడవలను ఉపయోగించి డ్రెడ్జింగ్ చేసి ఒడ్డున పెద్దపెద్ద ఇసుక పోగులు పెట్టి పగటి పూట దర్జాగా విక్రయించుకుంటున్నారు. గాయత్రి ర్యాంపుల్లో ఏటి గట్టు మీద ఉన్న కనకదుర్గమ్మ గుడికి కొద్ది సమీపంలో తుమ్మ డొంకల సమీపంలో గోదావరి పాయలో అనేక పెద్దపెద్ద పడవలను దాచిపెట్టారు. వీటితో రాత్రి వేళలో డ్రెడ్జింగ్ చేసి పగటిపూట ఎవరికీ కనబడకుండా యంత్రాలను దాచేస్తున్నారు. ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయాలకు కొద్ది కిలోమీటర్ల దూరంలోనే ఈ ర్యాంపులు ఉన్నప్పటికీ ఇరిగేషన్ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ఇదేమీ తమకు తెలియనట్టే వ్యవహరించడం గమనార్హం. ఆదివారం సాయంత్రం డ్రెడ్జింగ్ బోట్లను ఇసుక డ్రెడ్జింగ్‌కు సిద్ధం చేస్తున్న దృశ్యం ఆంధ్రజ్యోతి కంట పడింది. కోటి లింగాలరేవు,కొవ్వూరు నుంచి తాళ్లపూడి వైపు రాత్రి వేళల్లో భారీగా డ్రెడ్జింగ్ జరుగుతుంది.అధికారులు పగటిపూట వెళ్లి తనిఖీ చేసి ఈ డ్రెడ్జింగ్ యంత్రాలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టు కోవచ్చు. ఇక్కడ కేవలం బోట్స్‌మన్ సొసైటీలు మాత్రమే ఇసుక తీయాలి. కానీ అనుమతులు లేకుండా ఎన్జీటీ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక దోపిడీ చేయడం గమనార్హం.

రాత్రిపగలూ దోపిడీ..

ఇప్పటి వరకూ రాజమహేంద్రవరం అఖండ గోదావరి ఇసుక ఆదారం. ఇటీవల కపిలేశ్వరపురం, తాతపూడి, ఊబలంక, వద్దిపర్రు, పొడగట్లపల్లి, నార్కెడిమిల్లి ర్యాంపులు తెరుచుకున్నాయి.ముఖ్యంగా జొన్నాడ సమీపంలోని కపిలేశ్వరపురంలో రోజుకు 250 నుంచి 300 లారీల ఇసుక తరలిస్తున్నారు.ఇక్కడ టన్ను ఇసుక కేవలం రూ.50కే సరఫరా చేస్తామని టెండర్లు దక్కించుకున్నారు.యంత్రాలు వినియోగించ కూడదనే నిబంధన ఉంది.అయినా ఎక్కడా భయం లేదు. ఆరు యంత్రాలు పెట్టి రాత్రిళ్లు దర్జాగా తవ్వేసి రవాణా చేస్తున్నారు.కాకినాడ వైపు లారీలు వెళుతున్నట్టు స్థానికుల కథనం.టెండర్ నిరయించిన ధర ప్రకారం టన్నుకు కేవలం రూ.50 మాత్రమే తీసుకోవాలి.అంటే 20 టన్నుల ఇసుకకు కేవలం రూ.1000 మాత్రమే ర్యాంపులో వసూలు చేయాలి.రవాణా చార్జీలు వేరేగా ఉంటాయి.కానీ ర్యాంపులోనే రూ.6 వేల నుంచి రూ.9 వేలు వసూలు చేయడం గమనార్హం. ఇప్పటికే సీఎంవో వరకూ ఫిర్యాదులు వెళ్లినట్టు తెలిసింది. దోపిడీ మాత్రం ఆగడం లేదు.

ఉచిత ఇసుక అడ్డగింత..

ఇసుకాసురులు ఉచిత ఇసుక ఇవ్వడానికి ఒప్పుకోవడం లేదు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ట్రాక్టర్లు, ఎండ్ల బండ్ల మీద గ్రామానికి చెందిన ఎవరైనా ఇసుకను ఉచితంగా తీసుకుని వెళ్లవచ్చు. ఇసుకాసురులు రకరకాల ఎత్తుగడలతో ట్రాక్టర్లు,ఎండ్ల బండ్లను కూడా దరి చేరనీయడం లేదు.ఎవరైనా ట్రాక్టర్,బండితోనూ ఉచిత ఇసుక కోసం ర్యాంపులోకి వచ్చే ప్రయత్నం చేస్తుంటే వాటికి అడ్డంగా లారీలను పెట్టేస్తున్నారు. దీంతో మొత్తం ఉచిత ఇసుక విధానం ధ్వంసమైంది. కాకినాడ స్టాక్ పాయింట్లకు కూడా ఇసుక రవాణా చేయడం లేదు. దీంతో ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం విమర్శలకు తావిస్తోంది.

విజ్జేశ్వరంలోనూ యథేచ్ఛగా..

నిడదవోలు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అఖండ గోదావరి పరీవాహక ప్రాంతంలో రాత్రయితే చాలు దొంగలు పడుతున్నారు.. ఇసుకను దోచేస్తున్నారు. గోదారమ్మ గుండెలను పిండేలా అర్ధరాత్రి వేళ ఇసుక మాఫియా విజృంభిస్తుంది. జిల్లాలోని విజ్జే శ్వరం బ్యారేజ్ సమీపంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. రాత్రి 11 గంటల నుంచి తెల్ల వారుజామున 4 గంటల వరకు విజ్జేశ్వరం గోదావరి నుంచి ఇసుకాసురులు ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు. బ్యారేజీకి ముప్పు వాటిల్లేలా ఇసుకను అక్రమంగా తవ్వేస్తున్నారు.ఒక ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన ముఖ్య నాయకుడి వ్యక్తిగత సహాయకుడి అండదండలతో ముఖ్య నాయకులు ఇద్దరు అక్రమ ఇసుక వ్యాపారాన్ని సాగిస్తున్నట్టు సమాచారం.అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకుండా వ్యక్తిగత సహాయకుడు కట్టడి చేస్తున్నాడు. సంక్రాంతి పండగ నుంచి నిన్నటి వరకు నిడదవోలు మండలం విజ్జేశ్వరం, పందలపర్రు ర్యాంపుల్లో నిర్వాహకులు, కార్మికులకు మధ్య సఖ్యత కుదరని కారణంగా ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి.ఇదే అదునుగా విజ్జేశ్వరంలో ఇసుక మాఫియా విజృంభించేసింది.ఆరు లారీలు,మూడు ట్రాక్టర్లుగా రాజకీయ పార్టీ పట్టణ,మండల ముఖ్య నాయకులు ఇద్దరూ ఒక్కటై దబ్బులు దండుకుంటున్నారు.విజ్జేశ్వరం ఇసుక మాఫియాపై అధికారులకు సమాచారం వెళుతున్నా స్పందించడంలేదు. ముఖ్యనాయకుడి అనుచరులే అక్రమ ఇసుక వ్యాపారానికి తెరలేపడం చర్చ నీయాంశంగా మారింది.మూడు రోజుల కిందట విజ్జేశ్వరంలో అక్ర మంగా ఇసుక తరలి స్తున్న ట్రాక్టరును వీఆర్ వో ఫిర్యాదు మేరకు సమి శ్రగూడెం ఎస్ఐ వీరబాబు ఆధ్వర్యంలో సీజ్ చేసి కేసు నమోదు చేశారు.



ఫిబ్రవరిలో సీఎం చంద్రబాబు రాక?

రాజమహేంద్రవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చే నెల మొదటి వారంలో జిల్లాకు రానున్నారు. ఇప్పటికే నిర్మించిన ఇళ్ల గృహ ప్రవేశాలకు శ్రీకారం చుట్టనున్నారు. సభ కూడా జరగవచ్చు. అధికారికంగా ఖరారు కావలసి ఉంది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో ఏదో ఒక చోట కచ్చితంగా వచ్చే నెల మొదటి సీఎం ప్రోగ్రాం ఉండవచ్చనేది సమాచారం.ఈ మేరకు జిల్లా యంత్రాంగానికి సమాచారం అందింది.ఎప్పుడు ఎక్కడ అనేది ఒకట్రెండు రోజుల్లో ఖరారు కావొచ్చు.ఇప్పటికే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.వాస్తవానికి ఫిబ్రవరి 1న పశ్చిమగోదావరి జిల్లా తణుకులో సీఎం చంద్రబాబు పర్యటించాల్సి ఉంది.అయితే అని వార్య కారణాల వల్ల రద్దయినట్టు సమాచారం. ఇదిలా ఉండగా రాష్ట గృహ నిర్మాణ శాఖ ఎండీ మంగళవారం జిల్లాలో గృహ నిర్మాణాలు జరిగే ప్రాంతాల్లో పర్యటించనున్నారు.



చంద్రబాబుకు నల్లమిల్లి ఆహ్వానం

అనపర్తి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : తన కుమారుడు మనోజ్‌రెడ్డి వివాహానికి హాజరు కావాలని కోరుతూ అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం ఉండవిల్లి ముఖ్యమంత్రి నివాసంలో చంద్రబాబును కలిసి ఆహ్వాన ప్రత్రిక అందజేశారు. వచ్చే నెల 8వ తేదీన హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ విష్పెర్ వ్యాలీలో పెళ్లి జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట తల్లి సత్యవతి, సతీమణి మహాలక్ష్మి, నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, డాక్టర్ నల్లమిల్లి సనాతని తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాల్లో వెనుకబడితే..
సిబ్బంది జీతాలు ఆపండి!

- గృహ నిర్మాణ లక్ష్యాలు చేరాల్సిందే
- 4 మండలాల అధికారులపై ఆగ్రహం
- మార్చికి 3823 ఇళ్లు పూర్తికావాలి
- 1879 యూనిట్లకు రుణ సౌకర్యం
- హౌసింగ్‌పై కలెక్టర్ ప్రశాంతి సమీక్ష

రాజమహేంద్రవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గృహ నిర్మాణాలు వెనుకబడిన ప్రాంతాల్లో సిబ్బంది జీతాలు నిలిపివేయాలని.. పనితీరు ఆధారంగానే జీతాలివ్వాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాల పరిస్థితితో పాటు స్వర్ణాంధ్ర మిషన్ నెలవారీ కార్యక్రమాలపై సోమవారం ఆమె సమీక్షించారు. గృహ నిర్మాణాల్లో హౌసింగ్ అధి కారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణ లక్ష్యాలు చేరడంలో వెనకబడి ఉన్న కొవ్వూరు, అనపర్తి, చాగల్లు, సీతానగరం మండలాల అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గతం కంటే మెరుగుపడినట్టు సంబంధిత అధికారులు చెప్పారు. గృహ నిర్మాణాలు ఎప్పటిలోగా పూర్తవుతాయని ప్రశ్నించారు. నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతం చేయాలని సూచించారు. ఫిబ్రవరి మొదటి వారంలో ప్రజా ప్రతినిధుల సమక్షంలో గృహ ప్రవేశాలు వేడుకగా నిర్వహించాలన్నారు. మార్చి నాటికి 3823 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికి కేవలం 435 మాత్రమే పూర్తి చేశారన్నారు. జిల్లాలో పల్లెపండుగ ద్వారా చేపట్టిన 667 సీసీ రోడ్లలో 493 రోడ్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. మినీ డెయిరీ యూనిట్ల స్థాపనకు ఆయా కార్పొరేషన్ల వారీ లబ్ధిదారులను ఎంపిక చేయాలని చెప్పారు. బీసీ యాక్షన్ ప్లాన్ కింద రూ.52.46 కోట్లతో 1879 యూనిట్లకు సంబంధించి మూడు పట్టణ,10 మండలాల్లో సభ్యులకు రుణ సౌకర్యం కల్పించాలన్నారు.అంగన్వాడీల్లో 78 డ్రింకింగ్ యూనిట్లలో 75 యూనిట్లు పూర్తి చేసి, 173 టాయిలెట్లలో 166 పూర్తి చేసిన వారిని జేసీ ఎస్.చిన్నరాముడు అభినందించారు.సమావేశంలో డీఆర్వో టీసీ తారామూర్తి,డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, ఐసీడీఎస్ విజయకుమార్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలు పెండింగ్ పెట్టొద్దు

కొవ్వూరులో 30 అర్జీలు స్వీకరించిన కలెక్టర్ ప్రశాంతి



పేదల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులు రీఓపెన్ కాకుండా జవాబుదారీతనంతో పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజనల్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె ప్రజల నుంచి 30 అర్జీలు స్వీకరించారు. మండలస్థాయి అధికారులు అందరూ ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉండి ఫిర్యాదులు పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం అవసరమన్నారు.జేసీ ఎస్.చిన్నరాముడు మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కొవ్వూరు పట్టణానికి చెందిన కె.బి.బి.ఆర్.ఎస్ ఫణికుమార్ రోడ్డు కం రైలు వంతెనపై భారీ వాహనాలు వెళ్లకుండా గడ్డర్లు వేయడంతో ఎక్స్‌ప్రెస్ బస్సులు కొవ్వూరు పట్టణంలోకి రాకుండా గామన్ వంతెన మీదుగా వెళ్లిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. దేవరపల్లి మండలం అచ్యుయ్యపాలెంకు చెం దిన నీరుకొండ నాగదేవి వ్యవసాయం చేసుకోవడానికి నీటి సదుపాయం కల్పించాలని కోరారు. తాళ్లపూడి మండలం బయ్యవరం గ్రామానికి చెందిన ఉండవల్లి వెంకటలక్ష్మి తన పేరున ఉన్న భూమి ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదైందని సరిచేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ జి. దేవకుమార్, డీఎల్‌డీవో ఎ.శ్రీవారెడ్డి, డివిజనల్, మండల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో 136 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో 136 అర్జీలు స్వీకరించారు. డీఆర్వో టి.సీతారామమూర్తి సోమవారం ఉదయం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖ, డీఆర్‌డీఏ, పింఛన్లు, మునిసిపాలిటీలో పౌరసేవలు, జీఎస్‌డబ్ల్యు సేవలు, వైద్యశాఖ, దివ్యాంగ పెన్షన్, విద్యుత్ శాఖ సమస్యలపై అర్జీలు స్వీకరించారు.



పెద్దాసుపత్రికి వచ్చినా..
2 గంటలు ఆటోలోనే!

జీటీజీహెచ్‌లో వీల్‌చైర్, స్ట్రెచర్ అందుబాటులో లేక ఇక్కట్లు

రాజమహేంద్రవరం అర్బన్,జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధన సమగ్ర ఆసుపత్రి (జీటీజీహెచ్)కి వచ్చే రోగులకు ఆసుపత్రి అధికారుల నుంచి కనీస సహాయం అందడంలేదు. మంచం మీద నుంచి లేవలేని రోగులను వారి కుటుంబీకులు ఆటోల్లోనో, ఇతర ప్రైవేట్ వాహనాల్లోనో ఆసుపత్రి వరకూ తీసుకొస్తున్నా వారిని డాక్టర్ వద్దకు తీసుకెళ్లేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుంది. సోమవారం ఉదయం పదిన్నర గంటల సమయంలో సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామానికి చెందిన ఏలూరి పోసియ్యను నడవలేని స్థితిలో అతడి కుటుంబీకులు ఆటోలో ఆసుపత్రికి తీసుకొచ్చారు. అతడిని డాక్టర్ వద్దకు తీసుకెళ్లడానికి వీల్‌చైర్ అవసరం పడింది. వీల్‌చైర్ దొరికితే అందులో కూర్చోబెట్టుకుని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లేందుకు అతని భార్య, కుమారుడు,దగ్గరి బంధువు ఒకరు ఆసుపత్రి అంతా కలియతిరిగారు. ఎక్కడా వీల్‌చైర్ కనిపించలేదు. ఇలా సుమారు రెండు గంటలసేపు పోసియ్య ఓపీ బ్లాకు ఎదురుగా ఆటోలోనే ఎదురు తెన్నులు చూడాల్సి వచ్చింది. చివరకు కుటుంబీకులు ఎలాగోలా వీల్‌చైర్ సంపాదించి పోసియ్యను డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. జీటీజీహెచ్ వద్ద ఇటువంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి.వందలాదిగా సిబ్బంది ఉన్నా సేవలకు ఒక్కరు ముందుకు రాకపోవడం గమనార్హం.

ఇలాంటి ఘటనలు నిత్యకృత్యం..

ఎమర్జన్సీ కేసులు వచ్చే ప్రధాన ఎంట్రన్స్‌తో పాటు క్యాజువాలిటీ విభాగాల వద్ద వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉండడంలేదు. అసలు ఆసుపత్రిలో ఎన్ని వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉన్నాయి, ఏయే వార్డుల్లో ఎన్ని ఉపయోగిస్తున్నారు అనే లెక్కలు ఆసుపత్రి ఉన్నతాధికారుల వద్ద ఉన్నాయా లేవా అనేది కూడా అనుమానమే.ఆసుపత్రి అధికారులకు ఈ సమస్య చాలా చిన్నదిగా కనిపిస్తున్నా రోగులు, వారి కుటుంబీకుల కోణంలో నుంచి చూస్తే సమస్య ఎంత తీవ్రమైందో అర్థమవుతుందనే వాదన ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల నుంచి వినిపిస్తోంది.ఈ సమస్యపై జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించాలని అత్యవసర వైద్యానికి వచ్చే బాధిత ప్రజలు కోరుతున్నారు.

కిర్లంపూడి సొసైటీలో రూ.104 కోట్ల అవినీతి
భార్యను ఆసుపత్రిలో చేర్పించి..
ఫిట్స్‌తో భర్త మృతి
7 అనపర్తిలో ఘటన

మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన జీటీజీహెచ్ స్పెషలాఫీసర్



రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీటీజీహెచ్) స్పెషలాఫీసర్ భాస్కరరెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. నడవలేని స్థితిలో ఉన్న రోగులు, దివ్యాంగులకు అవసరమైన వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉండాలని ఆర్ఎంవోకు సూచించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రిని సోమవారం సందర్శించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఆసుపత్రిలోని ప్రధాన భవనం మెయిన్ ఎంట్రన్స్ వద్ద ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ముందుగా ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు.వైద్యుల పనితీరు, ఆరోగ్యశ్రీ వైద్యసేవలు, రోగులకు అందుతున్న ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. వీల్‌చైర్లు, స్ట్రెచర్లు ఎన్ని ఉన్నాయి.కొత్తగా ఎన్ని వస్తున్నాయి.. ఇటీవల జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ప్రతిపాదనలు ఉంచారా లేదా అనే వివరాలను ఆర్ఎంవోను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బంది లేకుండా వైద్యసేవలు అందజేయాలని ఆయన సూచించారు.

అంతా బాగున్నారా!

ఏం బాబు ఎలా ఉన్నారు.. బాగున్నారా.. అంతా కులాశాయేనా.. మిమ్మల్ని కలిసి చాలాకాలమైందని ఇలా వచ్చా.. సమస్యలు ఏమైనా ఉన్నాయా చెప్పండి అంటూ.. సీనియర్ నాయకుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి సోమవారం బైక్‌పై కడియం మండలంలో కలియతిరిగారు.. కనిపించిన వారిని పలకరించుకుంటూ సాయంత్రం వరకూ అక్కడే గడిపారు.. పలు చోట్ల సమస్యలు విన్నారు.. టీడీపీ మండల అధ్యక్షుడు వెలుగుబంటి నాని బైక్ నడుపుతుండగా ఎమ్మెల్యే గోరంట్ల వెనుక కూర్చుని కడియం దేవీచౌక్ సెంటర్ నుంచి పడాల వారివీధి, చల్లా వారి వీధి, శెట్టిబలిజపేట, రామాలయం మీదుగా పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన వెంట ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ తదితరులు ఉన్నారు. - కడియం



హాస్టళ్లకు రూ.3.78 కోట్లు

సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి

దేవరపల్లి,జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హాస్టళ్ల మరమ్మతులకు రూ.3.78 కోట్లు నిధులు మంజూరయ్యాయని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి తెలిపారు.దేవరపల్లి మండలం గౌరీపట్నం, దుద్దుకూరు, చిన్నాయి గూడెం, యర్నగూడెం గ్రామాల్లో హాస్టళ్లను సోమవారం పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో ఉన్న 24 హాస్టళ్లలో 1800 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న హాస్టళ్లను తొలగించి కొత్తభవనాలు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు.గోపాలపురం నియోజకవర్గంలో ఆరు హాస్టళ్లు పూర్తిగా శిథిలమయ్యాయని చెప్పారు.నియోజకవర్గంలో హాస్టళ్ల సిబ్బంది కొరత ఉందని జూన్ కల్లా భర్తీ చేస్తామన్నారు. విద్యార్థులకు కాస్మోటిక్స్ బకాయిలు వెంటనే నిధులు విడుదల చేస్తామన్నారు.జిల్లాలోని 180 మంది పదవ తరగతి విద్యార్థులకు ట్యూషన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు రాజమండ్రి గైట్ కళాశా లలో అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. పరమేశ్వర బయోటెక్, 3ఎఫ్ ఆయిల్ పామ్,ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీల యజమానులు హాస్టళ్ల నిర్మాణానికి దాతలు ముందుకు రావడం జరిగిందన్నారు. ఆమె వెంట ఏఎస్‌డబ్ల్యూవో ఆర్‌వీ.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



గౌరీపట్నంలో హాస్టల్ అధికారులతో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి

సైకిల్ సవారీ

ఆరోగ్యానికి దారి..



కాకినాడలో సైకిల్ ట్రాక్‌పై సైక్లింగ్..



కాకినాడలో గోదావరి సైకిల్ క్లబ్

కాకినాడలో 2017లో కొంతమంది స్థానికులు ఆరోగ్య సంరక్షణకోసం సైక్లింగ్ చేయడం ప్రారంభించారు. అలా నలుగురితో గోదావరి సైకిల్ క్లబ్ ప్రారంభించారు. ఇప్పుడు 60మంది సభ్యులయ్యారు. ఇందులో ప్రముఖ వైద్యులు, జిల్లాస్థాయి అధికారులు, వ్యాపారస్తులు, మహిళలు కూడా ఉన్నారు. ఎన్‌టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ, డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, ట్రస్ట్ ఆస్పత్రి అధినేత డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి సహా ఇంకా ఎంతోమంది నిష్ణాతులైన వైద్యులు ఈ సైక్లింగ్ క్లబ్‌లో భాగస్వామ్యమై ఉన్నారు. ఇందులో సభ్యులంతా రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 8.30 గంటల వరకు సైక్లింగ్ చేస్తుంటారు. గతంలో కాకినాడ బీచ్ రోడ్డు నుంచి ఉప్పాడ, అద్దరిపేట వరకు సైక్లింగ్ చేసేవారు. ఆ రోడ్డు ఛిద్రమవడంతో కాకినాడ-కత్తిపూడి రహదారిలో గొల్లప్రోలు టోల్‌గేట్ వరకు వెళ్లి వస్తుంటారు. కాకినాడ నుంచి ఒక్కోసారి కురాడ, విరవాడ, కాపవరం ఇలా కాకినాడ పరిసర ప్రాంతాల్లో సైక్లింగ్ చేస్తుంటారు.

కాకినాడలో ప్రత్యేక ట్రాక్‌లు

కాకినాడలో సైక్లింగ్ కోసం జేఎన్టీయూకే నుంచి భానుగుడి వరకూ 3కిలోమీటర్ల మేర, వివేకానంద పార్కు చుట్టూ ఒక కిలోమీటర్ మేర సైక్లింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. సైక్లింగ్ చేసేందుకు దూరం వెళ్లలేనివారు, సమయం సరిపోని వారు ఈ రెండు ట్రాక్‌ల్లో ఉదయం, సాయంత్రం సైక్లింగ్ సాధన చేస్తున్నారు.

సైక్లింగే కాదు సేవ కూడా..

గోదావరి సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సైక్లింగ్‌తోపాటు పలు అవగాహన కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలు సైతం చేపడుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటుతున్నారు. పేద విద్యార్థులకు సైకిల్స్, బుక్స్, భోజనం ప్లేట్లు అందించి తోడ్పాటునందిస్తున్నారు. వీటితోపాటు క్యాన్సర్, ఆరోగ్యంపట్ల పర్యావరణ పరిరక్షణ కోసం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

వెయ్యి కిలోమీటర్లు పూర్తిచేసిన తొలి మహిళను నేనే





నాకు 46 సంవత్సరాలు. నేనో గృహిణిని. గతంలో వాకింగ్ చేసేదాన్ని. అనారోగ్య సమస్యలు ఉండడంతో వైద్యుడు సైక్లింగ్ చేయాలని సూచించారు. అనారోగ్యాన్ని జయించడానికి సైక్లింగ్ చేయమని డాక్టర్ ఇచ్చిన సలహా నా జీవితాన్ని మార్చేసింది. నా అనారోగ్య పరిస్థితులు కూడా అధిగమించాను. ప్రారంభంలో రోజుకు 10 నుంచి 20 కిలోమీటర్లు వెళ్లేదాన్ని. తర్వాత పోటీలకోసం కాకినాడ నుంచి అన్నవరం, చేబ్రోలు వెళ్లొచ్చేదాన్ని. సూపర్ రాండోనీర్స్ పూర్తి చేశా. అనంతరం అమరావతి రాండోనీర్ వాళ్లు వెయ్యికిలోమీటర్లు పోటీ నిర్వహించారు. ఇందులో గుంటూరులో మొదలై కరీంనగర్‌కు 75గంటల్లో వెళ్లి రావాలి. ఆంధ్ర రాష్ట్రంలో ఈ రెండూ పూర్తి చేసిన తొలి మహిళను నేనే. హైవే మీద రాత్రిళ్లు భారీ వాహనాలు వెళ్తున్నా ధైర్యంగా పూర్తి చేశా. సైకిల్‌కు పంక్చర్ వేయడం, మరమ్మతులు చేయడం కూడా నేర్చుకున్నా. వచ్చేఏడాది లండన్‌లో నిర్వహించే 1500 కిలోమీటర్ల పోటీలో పాల్గొంటా.

● కోనేరు అనిత, కాకినాడ



సైక్లింగ్..
ఉరుకుల పరుగుల జీవితంలో రిలీఫ్‌నిచ్చే వ్యాయామం ఇది.. ఆసక్తి ఉండాలే గానీ సైకిల్ తొక్కితే ఆనందం, ఆరోగ్యం కలిసొస్తాయి. ఒకప్పుడు ఎంత దూరమైనా సైకిల్‌పై వెళ్లి పనులు చక్కబెట్టుకుని వచ్చేవారు.. అలా సైకిల్ తొక్కడంవల్ల ఆరోగ్యంగా ఉండేవారు. ఇదొక వ్యాయామం లాగా ఉపయోగపడి రోజంతా చురుగ్గా ఉండడంతోపాటు వారికి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటారు. కాలక్రమంలో సైకిళ్లను ఉపయోగించేవారు తగ్గారు. విద్యార్థులు, చిన్నారులు తప్ప పెద్దలు ఆ జోలి కెళ్లడం లేదు..

ఆంధ్రజ్యోతి, కార్పొరేషన్(కాకినాడ)/కాకినాడ రూరల్/జీజీహెచ్(కాకినాడ):

సమాజంలో సైకిళ్లు తొక్కేవాళ్లు తగ్గారు కానీ ఇటీవల కాలంలో కొందరు ఆసక్తి ఉన్న వ్యక్తులు గ్రూపులుగా ఏర్పడి సైక్లింగ్ క్లబ్‌లు ఏర్పాటు చేసి క్లబ్ పేరిట సైక్లింగ్ చేస్తున్నారు. రోజువారీగానే కాకుండా వారాంతాల్లో దూరప్రాంతాలకు సైతం వెళ్తున్నారు. కాకినాడ జిల్లాలోని కాకినాడ సిటీ, మిగిలిన చోట్ల కూడా ఈ తరహా సైక్లింగ్ చేసేవారు కనిపిస్తుంటారు. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉన్నారు, వైద్యులు ఉన్నారు, విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు..గృహిణులు కూడా ఉన్నారు..

- సైక్లింగ్‌తో ఆరోగ్యానికి మేలంటున్న వైద్యులు
- కాకినాడలో గోదావరి సైక్లింగ్ క్లబ్ ఏర్పాటు
- 60 మంది వరకు సభ్యులు..
యువకులు, వృద్ధులు, మహిళలు కూడా..
- ప్రతిరోజూ పదుల సంఖ్యలో సైకిల్‌యానం

రాండోనీర్లు.. సూపర్ రాండోనీర్లు..

క్లబ్ సభ్యులు రోజూ 40కిలోమీటర్లు, వారంతాల్లో 100 కిలోమీటర్లకు పైగా సైక్లింగ్‌కి వెళ్తున్నారు. క్లబ్‌లో వేల కిలోమీటర్లు సునాయాసంగా రైడ్ చేసిన సభ్యులు కూడా ఉన్నారు. ఐదుగురు సభ్యులు 200, 300, 600 కిలోమీటర్లు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం సైక్లింగ్ చేసిన సభ్యులు ఉన్నారు. పరిమిత సమయంలో 200 కిలోమీటర్లు దాటి సైక్లింగ్ చేసిన వాళ్లను రాండోనీర్లు అంటారు. వీటిని పలుసార్లు పూర్తి చేసిన వారిని సూపర్ రాండోనీర్లుగా అభివర్ణిస్తారు. కాకినాడలోని గోదావరి క్లబ్‌లో ఈ రాండోనీర్లు, సూపర్ రాండోనీర్లు కూడా ఉన్నారు.



సైక్లింగ్‌తో ఆరోగ్యం పదిలం



ఆరోగ్యానికి సైక్లింగ్ ఎంతో దోహదపడుతుంది. మా వైద్యులం కొందరం కలిసి గోదావరి సైక్లింగ్ క్లబ్‌లో చేరాం. మా గ్రూపులో స్టాన్లీ అనే వ్యక్తి ఆధ్వర్యంలో వృద్ధులు, మహిళలు సైక్లింగ్ చేస్తూ ఆరోగ్యవంతులు అవుతున్నారు. కొవిడ్‌కు ముందు విశాఖపట్నం, విజయవాడ కూడా సైక్లింగ్ చేసి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ప్రతి ఆదివారం బృందంగా వెళ్తుంటాం. సైక్లింగ్ చేయడం వల్ల మోకాళ్లపై ఒత్తిడి పడదు. గుండె పనితీరు మెరుగుపడుతుంది. మొత్తంగా అవయవాల్లో చలాకీతనం వస్తుంది. మా బృందంలో వైద్యులు డాక్టర్ సానా ప్రవీణ్, డాక్టర్ వై.రామకృష్ణ, డాక్టర్ ఆనంద్, డాక్టర్ విజయకృష్ణ, డాక్టర్ వెంకటాచలం, డాక్టర్ నారాయణమూర్తి, డాక్టర్ కిరణ్, డాక్టర్ హరీష్ ఉన్నారు.

● డాక్టర్ అరుణాదిత్య, కాకినాడ

3 ఏళ్లలో 36 వేల కి.మీ..



సైక్లింగ్ అలవాటుగా మారింది. మూడేళ్లలో 36వేల కిలోమీటర్లు సునాయాసంగా తొక్కేశాను. హైదరాబాద్ నాలుగుసార్లు, విజయవాడ ఆరుసార్లు, విశాఖపట్నం ఎనిమిదిసార్లు రైడ్ చేశాను. పారిస్ సంస్థ నిర్వహించిన పోటీల్లో కూడా మెడల్స్ అందుకున్నాను. 600, 300, 200 పూర్తి చేసిన వారిని సూపర్ రాండోనీర్లు అంటారు. పారిస్‌లో నాలుగేళ్లకోసారి నిర్వహిస్తారు. అది నేను నాలుగుసార్లు పూర్తి చేశాను. 1500 కిలోమీటర్ల పోటీకి సిద్ధమవుతున్నా.

-యండమూరి ప్రకాష్‌రావు, కాకినాడ

త్వరగా బరువు తగ్గొచ్చు



సైక్లింగ్ ద్వారా త్వరగా బరువు తగ్గడానికి ఆస్కారం ఉంటుంది. ఇంకా చాలా ఆరోగ్యపరమైన ఉపయోగాలున్నాయి. మంచి శరీరాకృతి ఏర్పడడంతోపాటు మధుమేహం, రక్తపోటు అదుపులోకి వస్తాయి. ఉదయాన్నే సైకిల్ తొక్కడంవల్ల రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుంది. నేను కూడా 1500 కిలోమీటర్ల పోటీకి సిద్ధమవుతున్నా.

● దేవు రాజేశ్వర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

జేఎన్‌టీయూకేలో ఐఐఐపీటీ ఆధ్వర్యంలో..

పూల్ క్యాంపస్ డ్రైవ్


క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థులకు సూచనలిస్తున్న ఐఐఐపీటీ డైరెక్టర్ డాక్టర్ బీటీ కృష్ణ

» 120మంది హాజరు కాగా 27మంది ఉద్యోగాలకు ఎంపిక

జేఎన్టీయూకే, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయూకేలోని సెనేట్‌హాల్లో ఐఐఐపీటీ డైరెక్టరేట్ డైరెక్టర్ డాక్టర్ బీటీ కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం పూల్ క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహించారు. దీనిలో మెకానికల్, కెమికల్, ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) విద్యార్థులకు తిరుచ్చిలోని శ్రీసాయి పవర్ అండ్ ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చేపట్టిన క్యాంపస్ డ్రైవ్‌కు వర్సిటీ, డిగ్రీ కళాశాలలనుంచి 120మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 27మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు బీటీ కృష్ణ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు దేశంలోని కంపెనీకి సంబంధించిన 35 ప్రాజెక్టుల్లో ఎక్కడైనా విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు.

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి హుండీ ఆదాయం రూ.39,02,348


ఆలయంలో స్వామివారి హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

అంతర్వేది, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం హుండీల ఆదాయం లెక్కించారు. ప్రధాన ఆలయంలోని హుండీల ద్వారా రూ.38,29,465, గుర్రాలక్కమ్మవారి హుండీ ఆదాయం రూ.16,780, అన్నదాన హుండీ ద్వారా రూ.56,103 మొత్తం హుండీల ద్వారా ఆదాయం రూ.39,02,348 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు జరిగింది. కార్యక్రమంలో ఎంపీటీసీ భైరా నాగరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం 'సోనోవిజన్'లో లక్కీడ్రా ద్వారా విజేతల ఎంపిక


లక్కీడ్రాలో పాల్గొన్న సంస్థ ఎండీ భాస్కరమూర్తి, ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జేఎన్‌రోడ్‌లోని సోనోవిజన్ షోరూంలో సోమవారం లక్కీ డ్రా తీసి విజేతలను ఎంపిక చేశారు. సంక్రాంతి,రిపబ్లిక్‌డే సందర్భంగా రాజమహేంద్రవరం, కాకినాడ షోరూంల్లో కొనుగోళ్లు చేసిన కస్టమర్లకు ఏర్పాటు చేసిన ఈ డ్రా కార్యక్రమానికి రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లక్కీ డ్రాలో మొదటి బహుమతి మారుతి ఆల్టోకారును పిఠాపురానికి చెందిన ఎన్.అన్నపూర్ణ గెలుచుకోగా రెండో బహుమతి ఎల్‌ఈడీ టీవీని రాజమహేంద్రవరానికి చెందిన కె.చైతన్య, మూడో బహుమతి రిఫ్రిజిరేటర్‌ను రాజమహేంద్రవరానికి చెందిన అఖిల్‌కుమార్, నాలుగో బహుమతి వాషింగ్ మెషీన్‌ను కాకినాడకు చెందిన అల్లం కుమార్ గెలుపొందారు. సోనోవిజన్ ఎండీ భాస్కరమూర్తి మాట్లాడుతూ తమసంస్థ ద్వారా తక్కువ ధరల్లో నాణ్యమైన గృహోపకరణాలను అందిస్తూ నమ్మకమైన సర్వీసు ఇవ్వడంలో ముందంజలో ఉన్నామన్నారు.

అన్నవరం దేవస్థానంలో..

ఆదాయం పెంపు, వ్యయాల తగ్గింపుపై ప్రత్యేక కమిటీ

» అన్ని విభాగాల ఏఈవోలు, నలుగురు సూపరింటెండెంట్, సహాయ కమిషనర్‌తో కమిటీ
» దేవస్థానంలో ప్రస్తుతం ఆర్థిక పరిస్థితి అతలాకుతలం

అన్నవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానంలో ఆర్థిక పరిస్థితి అతలాకుతలంగా మారడంతో ఈవో వీర్ల సుబ్బారావు ప్రత్యేక కమిటీని నియమించారు. సహాయ కమిషనర్, అన్ని విభాగాల ఏఈవోలు, నలుగురు సూపరింటెండెంట్‌లతో ఈ కమిటీని నియమించారు. వీరంతా దేవస్థానం ఆదాయం పెంపు, వ్యయాల తగ్గింపుపై విశ్లేషణ చేసి ఒక నివేదికను తయారు చేసి ఇవ్వాలని, దీన్ని దేవదాయ కమిషనర్ అనుమతితో అమలు చేసేలా ఆలోచన చేస్తున్నారు. దేవస్థానానికి ఏటా రూ.170కోట్లు ఆదాయం వస్తున్నా సిబ్బంది జీతాలు, పెన్షన్ల రూపంలో రూ.80కోట్లు ఖర్చవుతుంది.ఇక ప్రసాదం తయారీ, వ్రతవిభాగంలో, ఇతర విభాగాలకు అవసరమైన దినుసుల కొనుగోలు, శానిటేషన్ నిర్వహణ, ఇంజనీరింగ్ విభాగాల పనులతో ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగియకుండానే ఖర్చులు బడ్జెట్‌ను మించిపోయి సప్లమెంటరీ బడ్జెట్ అనుమతికోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. ఎన్నడూ లేనివిధంగా గతేడాది రూ.4కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను విత్‌డ్రా చేసి వినియోగించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇదేవిధంగా ఉంటే భవిష్యత్‌లో జీతాలు, పెన్షన్లను సకాలంలో చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో అప్రమత్తమైన ఈవో ఈ నిర్ణయం తీసుకున్నారు. వారంరోజుల్లో నివేదికను సమర్పించాలని కోరినా అధ్యయనం, నివేదిక తయారీకి ఇంకా సమయం పట్టవచ్చునని అధికారులు పేర్కొంటున్నారు.

మాజీ సైనికుల సమస్యలపై


రేపు 'స్పర్శ'

» రాజమహేంద్రవరంలో కార్యక్రమం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని మాజీ సైనికుల సమస్యలపై ఈనెల 29న రాజమహేంద్రవరం హోటల్ రివర్ బేలో స్పర్శ ఔట్‌రీచింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి కెప్టెన్ పి.సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అలహాబాద్ సీడీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరికి చెందిన మాజీ సైనికులు, మాజీ సైనిక వితంతువులు, మాజీ సైనిక సంఘాల వారంతా తమ సమస్యలు తెలపవచ్చన్నారు. బ్రిగేడియర్ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ వెంకటరెడ్డి హాజరై సమస్యలపై వినతిపత్రాలు స్వీకరిస్తారన్నారు.

నూతన దేవదాయ కమిషనర్‌ను కలిసిన

అన్నవరం వ్రతపురోహిత సంఘం


కమిషనర్‌ను కలిసిన దేవస్థానం వ్రతపురోహిత సంఘ నాయకులు

అన్నవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ దేవదాయ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.రామచంద్రమోహన్‌ను అన్నవరం దేవస్థానం వ్రతపురోహిత సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా సోమవారం కలిసి వేదాశీర్వచనాలు అందజేశారు. అన్నవరం దేవస్థానంలో అస్తవ్యస్తంగా ఉన్న వ్రతపురోహిత వ్యవస్థను 2010లో రామచంద్ర మోహన్ ఈవోగా వ్యవహరించిన సమయంలో ప్రక్షాళన చేసి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు, ఉద్యోగవిరమణ పురోహితులకు పెన్షన్ తదితర సౌకర్యాలు కల్పించారు. దీంతో వారికి ఆయనతోప్రత్యేక అనుబంధం ఏర్పడింది. ఈ సందర్భంగా రామచంద్రమోహన్ అన్నవరంలో వ్రతవిభాగం చాలా కీలకమైనదని, ఆలయ ప్రతిష్ట కాపాడేందుకు వ్రతపురోహితులు పాటుపడాలని సూచించారు. వ్రతపురోహిత సంఘ అధ్యక్షులు చామర్తి కన్నబాబు, మొకరాల రాజేష్, మంథా రాంబాబు గురుమూర్తి తదితరులున్నారు.

875 కిసాన్ డ్రోన్లతో యాంత్రీకరణ కేంద్రాలు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడులు తగ్గించడానికి, పంటలకు ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడానికి ఈఏడాది 875 కిసాన్ డ్రోన్లతో గ్రామస్థాయి యాంత్రీకరణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. రూ.10లక్షల విలువైన ఒక్కో యూనిట్‌కు 80% సబ్సిడీ, 50% బ్యాంక్ లోన్, రూ.70 కోట్ల రాయితీతో ఏర్పాటు చేస్తామని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అద్దె ప్రాతిపదికన ఈ యంత్ర సేవలు అందించడానికి 4-5మందితో రైతు సంఘాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

కుష్ఠురహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- డీఆర్వో టి. సీతారామ్మూర్తి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్వో

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాను కుష్ఠురహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని డీఆర్వో టి.సీతారామ్మూర్తి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహించే స్పర్శ కుష్ఠువ్యాధి అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఆర్వో మాట్లాడుతూ కుష్ఠువ్యాధిగ్రస్తుల పట్ల ప్రజల్లో వివక్ష లేకుండా చూడాలన్నారు. జిల్లా కుష్ఠు నియంత్రణ అధికారిణి డాక్టర్ వసుంధర, అధికారులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన శిబిరం ప్రారంభం

జీజీహెచ్(కాకినాడ) జనవరి 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్‌టీఆర్ భరోసా-దివ్యాంగుల పెన్షన్ పథకంలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రస్తుతం పెన్షన్‌కు అర్హులైన లబ్ధిదారుల సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన శిబిరాన్ని కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో సోమవారం ప్రారంభించారు. దృష్టిలోపం, వినికిడి లోపం, మానసిక వికలాంగులకు సంబంధించి ఆయా విభాగాల ద్వారా ఈ క్యాంప్‌నకు సంబంధించి అన్నిఏర్పాట్లు పూర్తి చేశామని ఆస్పత్రి డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాసన్ తెలిపారు. ప్రతి విభాగానికి ఇద్దరు వైద్య నిపుణులు ఈ శిబిరంలో పాల్గొంటారన్నారు. సదరం కేంద్రంలోకి వెళ్లి ఆధారు కార్డు ద్వారా ఓపీ చీటి నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం కలర్ కోటెడ్ చీటీని తీసుకోవాలన్నారు. కంటి విభాగం కోసం గులాబీ రంగు టోకెన్, ఈఎన్‌టీ విభాగం కోసం ఆకుపచ్చ టోకెన్, సైక్రియాట్రీ విభాగంకోసం నీలం టోకెన్ తీసుకుని సంబంధిత వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, సైకియాట్రీ వైద్య నిపుణులు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ యమున పాల్గొన్నారు.

30 నుంచి భావనారాయణస్వామి తిరునాళ్లు

సర్పవరంజంక్షన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 30 నుంచి మాఘమాస మహోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో ఎం.లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం సర్పవరం ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 23 వరకు మాఘమాస మహోత్సవాలు జరుగుతాయని, ఇందులోభాగంగా నాలుగు ఆదివారాలు భావనారాయణస్వామి తిరునాళ్లు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 2న మొదటి ఆదివారం తిరునాళ్ళ, 4న రథ సప్తమి వేడుకలు, 8న భీష్మా ఏకాదశి, 9న రెండో ఆదివారం తిరునాళ్ల, 12న మాఘ పౌర్ణమి, 16న మూడో తిరునాళ్ల, 23న నాలుగో తిరునాళ్ల నిర్వహించేందుకు భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నాలుగు ఆదివారాల్లో జరిగే తిరునాళ్లకు వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉందని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనం కోసం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

సాగు చేసుంటే బాగు!



గన్నవరంలో ఆరబెట్టిన మిర్చి పంట

- ఏజెన్సీలో మిర్చికి బదులు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల ఆసక్తి
- ఈ ఏడాది ఆశాజనకంగా మిర్చి సాగు
- ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్ల వరకు దిగుబడి
- ఎక్కువ పంట వేసుంటే ఆదాయం పెరిగే అవకాశం

ఎటపాక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో గత మూడేళ్ల నుంచి వరుస నష్టాలను చవిచూస్తున్న మిర్చి రైతులు ఈ ఏడాది మక్కువ చంపుకుని మిర్చికి బదులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ఆసక్తి చూపారు. ప్రధానంగా లంక పొగాకు, మినుము, మొక్కజొన్న, జామాయిల్ సాగు బాట పట్టారు. అయితే ప్రస్తుతం మిర్చి దిగుబడి బాగున్నా సాగు అంతంత మాత్రమే ఉంది. గత మూడేళ్లుగా మిర్చి పంటకు నల్లితామర పురుగు, వైరస్ ప్రభావంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. కనీసం పెట్టుబడులు కూడా రాక రూ.లక్షల్లో నష్టాలు మూట గట్టుకున్నారు. దాంతో ఏజెన్సీలో ఈ ఏడాది మిర్చి రైతులు పంట సాగుకు సాహసించని పరిస్థితి. గతేడాది ఎటపాక మండలంలో 3,300 ఎకరాల్లో మిర్చిపంట సాగు చేయగా, ఈ ఏడాది కేవలం 1,800 ఎకరాల్లో మాత్రమే పంట సాగు చేశారు. ఏజెన్సీలో గతంలో పది నుంచి పదిహేను ఎకరాల వరకు సాగు చేసిన మిర్చి రైతులు నష్టాలతో ఏడాదికి కేవలం 2, 3 ఎకరాల్లో మాత్రమే పంటను సాగు చేశారు. ఎకరం సాగుకు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడులు అయినట్టు రైతులు పేర్కొంటున్నారు.

వ్యాపించని వైరస్‌లు

అయితే ఈ ఏడాది పంటకు నల్లితామర పురుగు ఆశించలేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటివరకు ఎలాంటి వైరస్‌లు వ్యాపించ లేదని, దాంతో పంట దిగుబడి ఆశాజనకంగా ఉందంటున్నారు. ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పంట ఆశాజనకంగా ఉంది



గత ఏడాది 12 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. రూ.12 లక్షలు నష్టపోయా. ఈ ఏడాది కేవలం 3 ఎకరాల్లో సాగు చేశాను. పంట ఆశాజనకంగా ఉంది. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

వల్లభనేని కిషోర్‌కుమార్, రైతు, గన్నవరం

ఏజెన్సీలో గత వారం రోజుల నుంచి మిర్చి కోతలు నిర్వహిస్తున్నారు. అయితే జనవరి మొదటి వారంలో క్వింటా మిర్చి 15వేల వరకు ధర పలికి, ఆ తర్వాత తగ్గింది. ధర పడిపోవడంతో రైతుల ఆశలపై నీళ్ల చల్లినట్లైంది. ప్రస్తుతం మిర్చి పంట కిలో రూ.120 నుంచి రూ.130 వరకు పలుకుతోంది. ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసుంటే బాగుండేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం

కొవ్వూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. సోమవారం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో బ్రాహ్మణ రేవు గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 మధ్య ఉంటుందన్నారు. ఆరికిరేవుల వీఆర్వో ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.



గోదావరి నదిలో పోలీసులు గుర్తించిన మృతదేహం

దివ్యాంగుల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

తునిరూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను కాకినాడ జిల్లా తుని రాజా గ్రౌండ్‌లో సోమవారం వాలీబాల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బోడపాటి శివదత్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. దివ్యాంగుల్లో నైపుణ్యాన్ని వెలికితీసి ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే తమ ముందున్న లక్ష్యం అని శివదత్ పేర్కొన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు అంగదుర్గాప్రశాంతి మాట్లాడుతూ పారా వాలీబాల్ 4వ విడత రాష్ట్రస్థాయి పోటీలను తునిలో ప్రారంభించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. దీని ద్వారా దివ్యాంగులలో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు తుని చేరుకున్నారు. ఈ పోటీలు మూడురోజుల పాటు జరగనున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రెసిడెంట్ వి.వేణు, అసోసియేషన్ సెక్రటరీ సీహెచ్.గణేష్, జాయింట్ సెక్రటరీ డి.స్వరూప్, ట్రెజరర్ జెఎస్ సంతోష్‌రావు తదితరులు పాల్గొన్నారు.



తునిలో దివ్యాంగుల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం



పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు

అమలాపురంలో దొంగలు బీభత్సం

- ఆంధ్రజ్యోతి కార్యాలయంలో సామగ్రి ధ్వంసం.. నగదు అపహరణ
- పక్కనే ఉన్న చాందిని క్లినిక్‌లో చోరీ
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీమ్



ఆంధ్రజ్యోతి కార్యాలయంలో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

అమలాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణ నడిబొడ్డు గడియార స్తంభం సెంటర్‌లో ఉన్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు పడ్డారు. కార్యాలయంలో ఉన్న బీరువాను బద్దలు గొట్టి రూ.85వేల నగదును అపహరించుకుపోయారు. పక్కనే ఉన్న మరో క్లినిక్‌లో కూడా దొంగలు చొరబడి నగదు అపహరించుకుపోయారు. అమలాపురం పట్టణ టౌన్ పోలీసుస్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఈ రెండు భవనాల్లోను దొంగలు చొరబడి బీభత్సం సృష్టించారు. ఆంధ్రజ్యోతి కార్యాలయం ప్రధాన ద్వారం తాళాలను ధ్వంసం చేసి లోనికి ప్రవేశించారు. కార్యాలయంలో ఉన్న ఇనుప బీరువా తలుపులు ధ్వంసం చేసి లోపల సీక్రెట్ లాకరులో ఉన్న అడ్వర్‌టైజ్‌మెంట్‌కు సంబంధించిన నగదు రూ.85వేలను దోచుకువెళ్లారు. బీరువాలో ఉన్న సామాను అంతా చిందరవందరచేసి సామగ్రిని ధ్వంసం చేశారు. అదేవిధంగా కార్యాలయానికి పక్క భవంతిలో ఉన్న చాందిని క్లినిక్ షట్టర్ తాళాలు పగులకొట్టి లోనికి వెళ్లిన దొంగలు డ్రాయర్‌ను ధ్వంసం చేసి వాటిలో ఉన్న సుమారు రూ.35వేల నగదును అపహరించుకుపోయారు. ఈ దొంగతనాలు పోలీసు స్టేషన్‌కు ఎదురుగానే జరగడం పట్ల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 2రోజుల క్రితం సెంటర్‌లోనే ఉన్న పూలరంగడు షాపులో కూడా దొంగతనం జరిగింది. ఇలా పట్టణ నడిబొడ్డు అయిన సెంటర్‌లోనే దొంగలు రెచ్చిపోయి దోపిడీలకు పాల్పడుతున్న తీరును ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ ఘటనపై ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ ఎ.వెంకటేశ్వరరావు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్ కార్యాలయాన్ని పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. పట్టణ సీఐ పి.వీరబాబు, క్రైమ్ సీఐ గజేంద్రకుమార్, క్లూస్‌టీమ్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసినట్టు వారు తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్‌తో క్రైమ్ సీఐ

నాటిక పోటీల్లో విజేతలకు బహుమతులు



ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన స్వేచ్ఛ నాటికలో ఓ సన్నివేశం

పెద్దాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని చంద్రమాంపల్లిలో 3 రోజులపాటు నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతి ప్రదానం చేశారు. ఉత్తమ ప్రదర్శనగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ ప్రదర్శించిన స్వేచ్ఛ నాటిక నిలిచింది. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కె.శాంతారావు, జీవీఆర్.స్వామి, డి.రాధాకృష్ణ వ్యవహరించారు. విజేతలను కమిటీ తరుపున జీఎస్ఆర్.స్వామి ప్రకటించారు. ద్వితీయ ఉత్తమ నాటికగా మిత్ర క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఇది రహదారి కాదు నిలిచింది. ఉత్తమ నటులుగా స్వేచ్ఛ నాటికలో నటించిన ఆనంద్, గోకాడ వెంకట్, ఉత్తమ నటిగా రాత నాటికలో నటించిన వాగ్దేవి, ఉత్తమ రచయితగా ఆకురాతి భాస్కర్, ఉత్తమ దర్శకుడిగా బీఎస్.రెడ్డి, రంగాలంకరణకు ఫణి, ఆహార్యంకు పి.వేశన, సంగీతం అవార్డులు సురభి నాగరాజుకు దక్కాయి. కార్యక్రమంలో స్నేహా ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, గౌరవాధ్యక్షుడు ఇంధన బ్రహ్మానందం, కొత్తిం స్వామినాధన్, పాపేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి సొసైటీలో రూ.104 కోట్ల అవినీతి

- గుర్తించిన 51వ విచారణ కమిటీ
- పొలం లేకపోయినా, చనిపోయిన వారి పేర్లు మీద సొమ్ములు డ్రా చేసిన సొసైటీ అధికారులు
- అధికారులను నిలదీసిన రైతులు



అధికారులను నిలదీస్తున్న రైతులు

కిర్లంపూడి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ.104 కోట్ల 18 లక్షల 10వేల 572 అవినీతి జరిగినట్టు 51వ విచారణ కమిటీ గుర్తించిందని సొసైటీ అధికారులు వెల్లడించారు. మండల కేంద్రమైన కిర్లంపూడిలో సోమవారం సొసైటీ ఆవరణలో జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సొసైటీ సీఈవో పంపన వెంకటరమణ అధ్యక్షతన కోపరేటివ్ సొసైటీ పర్సనల్ ఇన్‌చార్జి ఎం.రంగనాయకులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రైతులు పాల్గొన్నారు. సీఈవో వెంకటరమణ మాట్లాడుతూ రైతులపై ఏ ఒక్క రూపాయి భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రైతులు అధికారులను నిలదీస్తూ వ్యవసాయ భూమి లేని వారికి కూడా రుణాలు ఇచ్చినట్టు లక్షలాది రూపాయిలు చూపించడం, అలాగే చనిపోయిన వారిపేర్లపై రుణాలు తీసుకుని సొసైటీ చుట్టూ రైతులను తిప్పారని గగ్గోలు పెట్టారు. అలాగే 51 ఎంక్వైరీ విచారణ కమిటీ పేరు చెప్పి 18 నెలలు సాగదీశారన్నారు. బూరుగుపూడి, సింహాద్రిపురం, కిర్లంపూడి, జగపతినగరం రైతులు రాజకీయం జోక్యం ఉద్యోగుల బరితెగింపుతో సొసైటీలో అక్రమాలు శృతి మించాయన్నారు. రైతులను మోసంచేసి అడ్డదారిన కోట్లు కొల్లగొట్టారన్నారు. ఇకనైనా వారిపై చర్యలు తీసుకుని సొమ్ములు రికవరీ చేయాలన్నారు. దీనిపై పెద్దాపురం డివిజనల్ సహకార అధికారి కె.పద్మ విచారణ జరిపి కాకినాడ జిల్లా సహకార అధికారి జి.వెంకటకృష్ణకు నివేదిక అందించడం జరిగిందన్నారు. ఈ మహాజనసభ నిర్వహించిన నేపథ్యంలో ప్రత్యేకాధికారి సహకార రిజిస్ట్రార్ రంగనాయకులు వారికి నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి నగదు నిల్వలో తేడాలు, జీతాల బకాయిల చెల్లింపుల్లో అక్రమాలు వెలుగు చూశాయన్నారు. డిపాజిట్లు, చెల్లింపులు వంటివి బకాయిలు వసూలు చేసిన రశీదు పుస్తకంలో నమోదు చేయలేదన్నారు. సీఈవో వెంకటరమణ మాట్లాడుతూ కిర్లంపూడి సొసైటీ మాజీ చైర్మన్ స్వర్గీయ ఏ.సూర్యకుమారి, కిర్లంపూడి సొసైటీ మాజీ చైర్మన్ సీహెచ్ రాజ్‌కుమార్, ప్రత్తిపాడు డీసీసీ బ్రాంచ్ మాజీ మేనేజర్ మురళీకృష్ణ, వైఎస్ నాగేశ్వరరావు, డీసీసీబీ ప్రత్తిపాడు సూపర్‌వైజర్ వివివిడీఆర్ ప్రసాద్,జేవీ మోహనరావు, ఎంసర సింహమూర్తిపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. రైతులకు ఇచ్చిన రుణాలు రూ. ఎనిమిది కోట్లు వసూలు చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపిందని మొత్తం రూ.30 కోట్లు ఇంకా రికవరీ కావాల్సి ఉండగా, వాటిని వసూలు చేస్తామని చెప్పడంతో రైతులు ఒక్కసారిగా రుణమాఫీ చేసి తీరాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ తీర్మానం కలెక్టర్‌కు నివేదించడం జరుగుతుందని హామీ ఇచ్చారు.

మావోయిస్టు నేత చందన మిశ్రా అరెస్టు



చందన మిశ్రా (ఫైల్)

చింతూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ దండ కారణ్య నాయకుడు చందన మిశ్రా అలియాస్ నగేష్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చింతూరు ఎస్‌ఐ పేదూరి రమేష్ తెలిపిన వివరాలివి.. తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన చందన మిశ్రా 2018లో మావోయిస్టుల్లో చేరాడు. అనతికాలంలోనే పార్టీలో అంచెలంచెలుగా ఎదిగాడు. 2018లో చందన మిశ్రాను చింతూరు డివిజన్ ఎటపాక పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం జైలు నుంచి వచ్చాక కూడా మావోయిస్టుల కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నాడు. దీంతో తిరిగి చింతూరు పోలీసులు ఈనెల 25న అదుపులోకి తీసుకొని సోమవారం మరోసారి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ చెప్పారు.

రేపు పిఠాపురంలో నృత్యకళా ప్రదర్శన

పిఠాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29న పిఠాపురంలో పశ్చిమబెంగాల్ సంప్రదాయ జానపద నృత్యరూపకం పురూలియా చౌ నృత్యకళా ప్రదర్శన జరగనుంది. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలోని పీఠికాపుర కళావేదికపై ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు సంగమేశ్వర సంగీత సమాఖ్య ప్రతినిధులు తెలిపారు.

డీమార్ట్‌లో కాలం చెల్లిన సరుకుల విక్రయం

- ఆందోళనకు దిగిన బాధితులు



ఆందోళన చేస్తున్న యువకులతో మాట్లాడుతున్న పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట డీ మార్ట్ వద్ద సోమవారం గందరగోళం నెలకొంది. కొంతమంది వినియోగదారులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే ఆదివారం రోజున కిషోర్ కుమార్ అనే వ్యక్తి వచ్చి 40 ఫ్రూటీ డ్రింక్స్ కేసును తీసుకున్నాడు. దాన్ని ఇంటికి తీసుకుని వెళ్లి పిల్లలతో కలిపి తాగారు. తీరా ప్యాక్‌ను పరిశీలిస్తే ఈనెల 8వ తేదీతో కాలపరిమితి ముగిసి ఉంది. దీంతో ఏదైనా జరుగుతుందేమోనని భయపడి రాత్రి 10 గంటల ప్రాంతంలో వ్యాపారసంస్థ వద్దకు వచ్చినప్పటికీ మేనేజర్ పట్టించుకోలేదు. దీంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు ఫిర్యాదు చేశారు. సోమవారం వారు వచ్చి ఆ వ్యాపార సంస్థలోని సామాన్లు పరిశీలిస్తే ఆ డ్రింక్‌కు సంబంధించి కాలపరిమితి ముగిసినవి లేవని నిర్ధారించారు. ఇంతలో ఆ డ్రింక్ తాగిన వారిలో ఇద్దరికి పెదవుల్లో తిమ్మిర్లు వచ్చాయని, మరో ఇద్దరు పిల్లలకు విరోచనాలు అయ్యాయని బాధితులు చెబుతున్నారు. దీంతో వారంతా ఆందోళన చేయడంతో బొమ్మూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డీమార్ట్ మేనేజర్‌ను అదుపులోనికి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. దీనిపై విచారణ కొనసాగుతోంది.

వ్యక్తిపై దాడి కేసులో వైసీపీ నేతపై కేసు

సర్పవరం జంక్షన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై దాడి కేసులో వైసీపీ నేత కడియాల చిన్నపై సోమవారం సర్పవరం పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట గైగోలుపాడుకి చెందిన పెంకే శివపై అదే ప్రాంతానికి చెందిన చిన్నతోపాటు మరో ముగ్గురు కలిసి దాడికి పాల్పడ్డారు. దీంతో తీవ్ర గాయాలపాలైన సదరు వ్యక్తి ఆదివారం రాత్రి చికిత్స కోసం జీజీహెచ్‌లో చేరాడు. అక్కడి అవుట్ పోస్ట్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు శివ ఫిర్యాదు మేరకు చిన్నతో పాటు కడియాల సత్తిబాబు, పాలిక శ్రీను, అంజిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఫ్లెక్సీ చించివేతపై జరిగిన కొట్లాటలో దాడి జరిగింది.

తొండంగిలో గ్యాస్ సిలిండర్లు చోరీ

అన్నవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తొండంగి వైష్ణోదేవి గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. 96 నిండు సిలిండర్లు అపహరణకు గురైనట్టు నిర్వాహకుడు వద్దాది ప్రసాద్ పేర్కొన్నాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు.

7 నుంచి బంగారు పాప ఉరుసు ఉత్సవాలు

కొత్తపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల ఏడో తేదీ నుంచి తొమ్మిది వరకు కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడ బషీర్‌బీబీ ఔలియా(బంగారుపాప) 70వ ఉరుసు ముబారక్ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు స్థానికము జువర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉరుసు ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు రానున్నారు.

'29లోపు అర్హత గల ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవాలి'

కాకినాడ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాణీలక్ష్మీబాయి ఆత్మరక్ష పరిశీలన- ఆత్మరక్షణ కార్యక్రమంలో భాగముగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని బాలికా విద్యార్థుల శిక్షణ కార్యకలాపాల అమలు కోసం అర్హత గల ఏజెన్సీల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్టు సమగ్ర శిక్ష ఏపీసీ వి.వేణు గోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 లోపు కాకినాడ సమగ్రశిక్ష కార్యాలయంలో సమర్పించాలని ఏపీసీ సూచించారు. ఇతర వివరాలకు ఎస్ఎస్ఏ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

భార్యను ఆసుపత్రిలో చేర్పించి వస్తుండగా.. మార్గ మధ్యలో ఫిట్స్‌తో భర్త మృతి



అప్పారావు మృతదేహం

అనపర్తి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్న భార్యను ఆసుపత్రిలో చేర్పించి తిరుగు ప్రయాణమైన భర్త మార్గ మధ్యలో మృతి చెందిన సంఘటన సోమవారం అనపర్తిలో చోటుచేసుకుంది. అనపర్తి అడిషనల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం చిన పొలమూరుకి చెందిన వల్లం అప్పారావు(52) మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. అయితే అనారోగ్యం పాలైన తన భార్యను ఆసుపత్రిలో చూపించేందుకు సోమవారం రాజమహేంద్రవరం వెళ్లాడు. అక్కడి వైద్యులు ఆమెను ఆసుపత్రిలో ఉంచాలని చెప్పడంతో భార్యను ఆసు పత్రిలో చేర్పించి ఇంటికి పయనమ య్యాడు. ఇంతలో అనపర్తి శివారు లోని హీరో హోండా షోరూమ్ సమీపానికి వచ్చేసరికి ఫిట్స్ రావడంతో అప్పారావు మోటార్ సైకిల్‌ను ఆపి కల్వర్టుపై కూర్చునే ప్రయత్నం చేశా డు. అప్పటికే తీవ్రత ఎక్కువ కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం కావాలి



పినపళ్లలో భర్త ఇంటి ముందు ధర్నా చేస్తున్న మహిళ

- భర్త ఇంటి ముందు భార్య ధర్నా

ఆలమూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తనకు న్యాయం కావాలంటూ ఓ మహిళ భర్త ఇంటి ముందు ధర్నాకు దిగింది. వివరాలివి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పినపళ్లకి చెందిన ఇల్లూరి రవికుమార్‌కు మండపేట మండలం ఏడిదకి చెందిన ఇళ్ల సత్యవతికి మూడేళ్ల క్రితం వివాహమైంది. అయితే వీరి కాపురం ఆరునెలలు సజావుగానే సాగినప్పటికీ.. అనంతరం విభేదాలు తలెత్తడంతో విడిపోయారు. అప్పటి నుంచి పలుమార్లు పెద్దల సమక్షంలో సర్దిచెప్పినా కాపురానికి తీసుకురావడానికి రవికుమార్ నిరాకరించాడు.దీంతో సత్యవతి భర్త ఇంటి ముందు సోమవారం ధర్నా చేసింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎం.అశోక్ మహిళా పోలీసును పంపించి వివరాలు సేకరించారు. అప్పటికే రవికుమార్ ఇంటికి తాళాలు వేసి వెళ్లిపోయినట్టు తెలిసింది.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ప్రజా పరిష్కార వేదికకు 35 ఫిర్యాదులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఫిర్యాదు అందించారు. అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ ప్రజల అర్జీలు స్వీకరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటిపై చర్చించారు. వాటి పరిష్కారానికి సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు ఫోను చేసి సమస్యలకు పరిష్కారం చేయాలని ఆదేశించారు. పీజీఆర్‌ఎస్‌లో 35 మంది ఫిర్యాదులను ఆయనకు అందించారు.

నగరపాలక సంస్థకు 17 అర్జీలు: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌లో 17 మంది అర్జీలు పెట్టుకున్నారు. ఇన్‌చార్జి అదనపు కమిషనర్ ఎస్.వెంకట రమణ, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న ప్రజల అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ పాండురంగారావు, సిటీప్లానర్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయ విలువలు ముఖ్యం



మాట్లాడుతున్న విద్యావేత్త సంఘం సేవకురాలు భారతీయం సత్యవాణి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు భారతదేశం సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు ముఖ్యమని విద్యావేత్త సంఘం సేవకురాలు భారతీయం సత్యవాణి అన్నారు. రాజమహేంద్రవరం జెఎన్ రోడ్డులోని సూర్యగార్డెన్స్‌లో శ్రీగౌతమి విద్యా సంస్థల ఆధ్వర్యంలో మానవతా విలువలు, నా బాధ్యత అంశంపై మంగళవారం 7, 8, 9 తరగతుల విద్యార్థినీ, విద్యార్థు లకు అవగాహన సదస్సులో ఆమె ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడుతూ విద్యార్థుల్లో మంచి లక్షణాలు, అలవాట్లపై తెలిపారు. అనంతరం శ్రీగౌతమి విద్యా సంస్థ అధినేత సుంకర రవికుమార్ మాట్లాడారు. తొలుత సత్యవాణి విద్యార్థిని, విద్యార్థులతో మాట్లాడి కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో శ్రీగౌతమి ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ

కడియం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. జేగురుపాడులో సైబర్‌నేరాలు,ట్రాఫిక్ రూల్స్ మాదక ద్రవ్యాలు, నేరాల నిరోధనకు సీసీ కెమెరాలు తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ నెంబర్ చెప్పమంటే చెప్పవద్దన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా బ్యాంకుకు వెళ్లాలన్నారు. ఎవరైనా ఊరు వెళితే ముందుగా పోలీసులకు సమాచారం ఇచ్చి వారింటి భద్రత నిమిత్తం ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.వాహనాలు నడిపేసమయంలో హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదలస్టాలిన్, ఉపసర్పంచ్ పాతూరి రాజేష్, ఎస్‌ఐ ధనలక్ష్మిప్రసన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా పేరాబత్తులను గెలిపించుకుందాం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఉభయ గోదావరి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించుకుందామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి ఉభయ గోదావరి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, మాజీ మంత్రి కేఎస్ జవహర్‌లతో టీడీపీ నాయకులకు, మాజీ కార్పొరేటర్లకు, డివిజన్ ఇన్‌చార్జిలకు, క్లస్టర్ ఇన్‌చార్జిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆదిరెడ్డి వాసు, అభ్యర్థి రాజశేఖర్ మాట్లాడారు. సమావేశంలో టీడీపీ నాయకులు కాశి నవీన్ కుమార్, రెడ్డిమణి, వర్రే శ్రీనివాసరావు, మజ్జి రాంబాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల దినోత్సవం

రాజమహేంద్రవరం రూరల్ జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరంలో ఉద్యోగ విరమణ చేసిన వారందరినీ సభ్యులుగా చేర్చాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి అన్నారు. సంఘ కార్యాలయంలో సోమవారం యర్రమోతు ధర్మరాజు అధ్యక్షతన జరిగిన పెన్షనర్ల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కామేశ్వర శర్మ, బండారు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రతో కూటమికి అధికారం

• దావోస్ పర్యటనతో రాష్ట్రానికి పెట్టుబడులు • ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్. పక్క చిత్రంలో సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి గీత కార్మికులతో కలిసి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వాసు, చైర్మన్ సత్తిబాబు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రెండేళ్ల కిందట తమ నాయకుడు నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర కూటమి ప్రభుత్వం ఏర్పడడంలో చాలా కీలక పాత్ర పోషించిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దారుణ పరిస్థితులు ఎదుర్కొంటున్న ప్రజల కోసం ఆనాడు లోకేశ్ తిరుపతిలో స్వామి వారి దర్శనం చేసుకుని యువగళం పాదయాత్ర ఆరంభించారన్నారు. అప్పుడు వైసీపీ పేటీఎం కుక్కలు లోకేశ్‌పై చేసిన కామెంట్స్ మేం మర్చిపోలేదన్నారు. అలాంటి వారందరికి చెంపపెట్టు మాదిరిగా పాద యాత్ర చేశారని చెప్పారు. పాదయాత్రలో అడుగడుగునా లోకేశ్ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతున్నారని చెప్పారు.రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావాలని రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు, లోకేశ్‌లు ప్రయత్నిస్తున్నారన్నారు.దీనిలో భాగంగానే దావోస్‌లో పర్యటించి రాష్ట్రానికి ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చి ఇతర రాష్ట్రాలతో పోటీ పడేలా చేశారని చెప్పారు. అక్కడ జరిగిన చర్చలు, సంప్రదింపులతో రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా వస్తాయని చెప్పారు. గతంలో ఇదే పర్యటనకు వెళ్లడానికి అప్పటి వైసీపీ మంత్రి గడ్డకట్టే చలిగురించి చేసిన కామెంట్స్ గుర్తుతెచ్చుకోవాలన్నారు. వైసీపీ నాయకుడు విజయసాయిరెడ్డి రాజీనామా ఒక జగన్నాటకమన్నారు. పార్టీలు మారిపోదామనుకునేవారిని వెంటనే చేర్చుకునే పరిస్థితి లేదన్నారు. కూటమి సమన్వయంతో ఉందని సంప్రదింపులు చేసుకుని అటుపై నిర్ణయాలు ఉంటాయన్నారు. రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు లో నూతన టెర్మినల్ కూలిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం సీరియ స్‌గా ఉందన్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, తాడేపల్లిగూడెం పరిశీలకులు నక్కా చిట్టిబాబు, నగర ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకిరామయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొయ్యల రమణ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కాదేవి వరప్రసాద్, యిన్నమూరి దీపు, టీడీపీ అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, బేసరి చిన్ని, హరిబెనర్జీ, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సు ఫీజు తగ్గింపుపై గీత కులాల హర్షం

లాలాచెరువులో చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం

కల్లుగీత కార్మికులు ఉపాధి కోల్పోకుండా చేయాలనే ఉద్దేశంతో ఐదెకరాలు కేటాయించి తాడిచెట్లు పెంచుకునేందుకు సహకరించేలా ఆలోచన చేస్తున్నట్టు రాజమహేంద్రవం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలి పారు. మద్యం దుకాణాల కేటాయింపుల్లో లైసెన్సు ఫీజు 50 శాతం తగ్గించడంపై లాలాచెరువు సెంటర్‌లో శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకట రెడ్డి విగ్రహం వద్ద గీత కులాల నాయ కులు వేడుక నిర్వహించారు. ముందుగా సీఎం చంద్రబాబు ఫ్లెక్సీ, దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం యువగళం పాదయాత్రను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నిర్వహించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. నీరా కేఫ్‌లు త్వరలో జిల్లాల వ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, సంఘ నాయకులు చింతపల్లి నాని, వంకా మల్లిబాబు, శీలం గోవింద్, కొల్లినాని, దుంగ నాగ మణి, చింతా కుల భాస్కర్, గుత్తుర్తి పాండురంగ, ఆనెం బ్రదర్స్, బుడ్డిగ గోపాలకృష్ణ, కె.శ్రీను, పిల్లి శ్యామ్ కుమార్, బుడ్డిగ రవి, జనసేన నాయకులు గుత్తుల బుల్లి తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు అన్ని విధాలా ప్రోత్సాహం

డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్

రాజమహేంద్రవరం రూరల్ జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఫౌండేషన్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ సమగ్ర శిక్షణ (జీఎఫ్ఎస్ఐ) ద్వారా మహిళా రైతులను వ్యవసాయ వ్యాపార వ్యవస్థాపకులుగా తయారు చేస్తుందని ఎన్ఐఆర్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్ అన్నారు. గ్రో ప్రాజెక్టు క్రింద పలు ప్రాంతాల్లో జీఎఫ్ఎస్ఐ వ్యవస్థాపకుల కోసం లక్ష్య శిక్షణ సెషన్లని నిర్వహిస్తుందన్నారు. ప్రస్తుతం వ్యవసాయ వ్యవస్థాపన కోసం మొక్కల ఆరోగ్య నిర్వహణపై ఏఐ పై దృష్టి సారించి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కలవచర్ల కృషివిజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ కె.గోపాలరావు, జీఎఫ్ఎస్ఐ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ సాకిబ్, అగ్రి డిజిటల్ టూల్స్ కోఆర్డినేటర్ మధు మంజరి, గ్రామీణ ఫౌండేషన్ ఎస్‌పీఎం ఆనంద్ నాయక్, ఎస్ డేవిడ్ జైనర్స్, లక్ష్మి, ఆనంద్ అయ్యర్, ప్రశాంత్ సింగ్, ప్రతాప్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకోను

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

కడియం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధిని అడ్డుకుంటే ఉపేక్షించేది లేదని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి హెచ్చరించారు. దుళ్లలో అసంపూర్తిగా నిలిచిన వాటర్ ట్యాంక్ ప్రాంతాన్ని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు.ఈ ప్రాంత ప్రజలకు మంచినీటి సమస్య తీర్చే విధంగా రూ.59 లక్షల అంచనాతో ప్రారంభించిన వాటర్‌ట్యాంక్ పనులు కొంతమంది స్వార్థపరుల కారణంగా ఆగిపోయాయని తెలిపారు. ఇప్పటికే గ్రామంలో 2 కిలోమీటర్ల పైపులైను ఏర్పాటు చేసి 240 ఇళ్లకు ట్యాపు కనెక్ష న్లు ఇవ్వడం జరిగిందన్నారు. స్థల వివాద విషయంపై సంబంధిత శాఖల అధికారులను పిలిచి వివరణ కోరగా ట్యాంక్ నిర్మాణం ఉన్న ప్రదేశం ప్రభుత్వ భూమి అని తెలిపారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఇది ప్రభుత్వభూమి అని తేలినందుకు ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను దృష్టిలో ఉంచు కుని యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలని తె లిపారు. చెముడులంక నుంచి దుళ్ల వెళ్ళే రోడ్డులో పంట కాల్వ ఆక్రమణకు గురైందని గుర్తించి ఆక్రమణలు తొలగించాలని పంట కాల్వల ద్వారా రైతులకు సకాలంలో నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులకు సూచించారు.ఆయన వెంట వెలుగుబంటి ప్రసాద్, చిట్టూరి అమ్మిరాజు, వెలుగుబంటి నాని, ముమ్మిడి దేవీనాగేశ్వరరావు, గుర్రప్ప సత్యనారాయణ, ఇన్‌చార్జి తహశీల్దారు సునీల్ కుమార్, ఎంపీడీవో రమేష్, చెల్లుబోయిన శ్రీను, ప్రత్తిపాటి రామారావుచౌదరి, బోడపాటి గోపి, ముద్రగడ జమీ పాల్గొన్నారు.

మురళీకొండపై పూజలు

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : బొమ్మూరులోని మురళీ కొండపై శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామివార్ల తిరు కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త కామిని ప్రసాద్ చౌదరి దంపతులు కల్యాణం నిర్వహించారు. సాయంత్రం భారతీయం సత్యవాణి ఆధ్యాత్మిక ప్రవచనం కార్యక్రమాలు తదుపరి పూర్ణాహుతి నీరాజన మంత్ర పుష్పాలతో ముగిసింది. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్వామివారికి పూజలు చేశారు.

కడియం తహశీల్దార్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి

కడియం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కడియం మండలంలో తహశీల్దారుగా ఉద్యోగం చేయడం తనకు సంతృప్తినిచ్చిందని డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన తహశీల్దారు పోశిబాబు తెలిపారు. కొద్దికాలంపాటు తహశీల్దారుగా పనిచేసినా ఇక్కడి ప్రజలు, అధికారులు ఎంతో సహకరించారన్నారు. డిప్యూటీ కలెక్టర్‌గా చింతూరుకు వెళుతున్నా, ఇక్కడి ప్రజల ఆదరాభిమానాలు మరువలేనన్నారు. తనకు సహకరించిన ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పీఎంపీ రాష్ట్ర సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి 27(ఆంధ్రజ్యోతి): కేన్సర్‌పై ఫిబ్రవరి 4న అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి విబిటి రాజు అన్నారు. సోమవారం ఆనంద్ రీజెన్సీ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో విబిటి రాజు మాట్లాడారు. కార్యక్రమంలో కె.జనార్దన్, ఎస్.వేణుగోపాల్, ఎన్.జయసూర్య, కోన చిన్నారావు, గంగుమళ్ళ రాంబాబు, బళ్ళా శ్రీనివాసరావు, పి.దేవానందం, ఎస్.ప్రసాద్, ఎస్‌కె సుభాన్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న కూటమి నేతలు

ముకుందవరంలో ఉచిత పశు వైద్యశిబిరం

రంగంపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులంతా ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వడిశలేరు పశువైద్యాధికారి ఇ.జాన్‌పాల్ సూచించారు. సోమవారం ముకుందవరంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ సౌజన్యంతో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 54 పశువులకు వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు యడ్ల గణేష్, పట్టికూటి వెంకటేష్, కూసు సర్వారాయుడు, కాటే శ్రీను, రైతులు, రాజమండ్రి డిప్యూటీ డైరెక్టర్ మక్కిన వెంకటేశ్వరావు, జూనియర్ పశువైద్యాధికారిణి ఉమాదేవి, పశువైద్య సహాయకులు రాణి, శివ, దుర్గాప్రసాద్, సురేష్, సత్యకుమార్ పాల్గొన్నారు.

సాయికి ఉత్తమ అవార్డు



అవార్డుతో సాయి

రంగంపేట,జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఈలకొలను హైస్కూల్ కాంప్లెక్స్ సీఆర్‌ఎంటీ జటప్రోలు సాయి సూర్యనారాయణకు జిల్లా సేవా పురస్కారం లభించింది. జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త సుభాషిణి అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఎంవో గౌరీశంకరరావు, సీఎంవో శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాసరావు,పి.మధుసూదనరావు, సింగంపల్లి సీఆర్ ఎంటీ దుర్గారావు, రంగంపేట సీఆర్‌ఎంటీ శ్రీనివాసరాజు, కార్యాలయ సిబ్బంది, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, టీచర్లు అభినందనలు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ. 25 వేలు విరాళం



దాతను సత్కరిస్తున్న ఈవో

బిక్కవోలు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన కొల్లి దేదీప్‌సాయి కుటుంబ సభ్యులు సోమవారం రూ. 25వేలు విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఈవో ఏ. భాస్కర్ సాయి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

నేడు నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా

రాజానగరం,జనవరి27 (ఆంధ్రజ్యోతి): రాజానగరంలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఏపీఎస్‌ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ పెరుమాళ్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఏపీవీ మోటో కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్, ముత్తూట్ మైక్రోఫైనాన్స్ మెడ్‌ప్లస్ పార్మసీ వంటి ప్రముఖ కంపెనీల్లో సేల్స్ అండ్ మార్కెటింగ్, సర్వీస్ అడ్వైజర్స్ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్, బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, పార్మసిస్ట్, పార్మసీ అసిస్టెంట్, రిటైల్ ట్రైనీ అసోసియేట్, తదితర పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. టెన్త్, ఇంటర్ పైబడినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు రాజమహేంద్రవరం, రాజానగరం, పాలకొల్లు, భీమవరం, జంగారెడ్డిగూడెం, ఏలూరు ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. 19 నుంచి 29 సంవత్సరాలలోపు అభ్యర్థులు హాజరుకావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 99888 53335, 8712655686, 8790118349 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

పది విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్స్



విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న హెచ్‌ఎం పార్థసారధి

రంగంపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీయూ సంఘం వారు రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను సోమవారం స్థానిక జడ్పీ హైస్కూల్లోని పదోతరగతి విద్యార్థులకు అందించారు. పాఠశాల హెచ్‌ఎం వీ.పార్థసారధి, ఎస్టీయూ జిల్లాల ఉపాధ్యక్షుడు పాటిబండ చంద్రశేఖర్, మండల జనరల్ సెక్రటరీ కే.ధర్మరాజు, ఆర్థిక కార్యదర్శి కే.సత్యనారాయణ చేతుల మీదుగా 130 మందికి అందజేశారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వి.సి.జాకబ్‌ను టీచర్లు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



కోరుకొండలో రోడ్డు భద్రతా వారోత్సవాల ర్యాలీ

కోరుకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక బస్టాండ్ నుంచి గవర్నమెంట్ హైస్కూల్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఉత్తర్వుల మేరకు నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. సత్యకిషోర్ పర్యవేక్షణలో ఎస్‌ఐ శ్యామ్‌సుందర్, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, కాలేజీ స్టూడెంట్స్ రోడ్డుభద్రతా నియమాలు పాటించాలంటూ నినాదాలు చేశారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించి, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



అవార్డులు పొందిన విద్యార్థులతో శ్రీఫౌండేషన్ శ్రీను, ఉపాధ్యాయులు

బిక్కవోలు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలు జడ్పీ హైస్కూల్లో 2023-24లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 24 మంది విద్యార్థులకు శ్రీఫౌండేషన్ వ్యవస్థాపకుడు కే. శ్రీను సోమవారం పురస్కారాలను అందజేశారు. ఆరు నుంచి 10వ తరగతి వరకు గత ఏడాది జరిగిన పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి వంద, యాభై, ముప్పై గ్రాముల వెండి పతకాలను ఇచ్చారు. అనంతరం శ్రీనుని పాఠశాల హెచ్‌ఎం పి. వీరప్రభాకరరావు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

బూరుగుపూడి టీడీపీ కార్యాలయంలో సంబరాలు

- కేక్ కట్ చేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎమ్మెల్సీ చిరంజీవి

కోరుకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్ర చేసి రెండు సంవత్సరాలైన సందర్భంగా సోమవారం బూరుగుపూడి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, మాజీమంత్రి జవహర్, ఎమ్మెల్సీ వి.చిరంజీవిరావు, తదితరులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా నిరాటంకంగా సాగిందన్నారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు, గంగిశెట్టి సత్తిబాబు, అడపా వీరబాబు, డాక్టర్ అడపా శ్రీనివాస్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం

- రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ




కూటమి నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

కోరుకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి బలపరిచిన పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. బూరుగుపూడి టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై సోమవారం అవగాహన కల్పించారు. మాజీ మంత్రి జవహర్ హాజరయ్యారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలో ..

కణుపూరులో కొలువై ఉన్న సోమాలమ్మ ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హాజరై అమ్మవారికి పూజలు చేసిన అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. తర్వాత ఆలయంలో నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొని పలువురికి వడ్డించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.





రోగులతో జీజీహెచ్ కిటకిట

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనా సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్) అవుట్‌పేషెంట్ విభాగం (ఓపీ) సోమవారం జనాలతో కిటకిటలాడింది. రోగులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి రావడంతో గందరగోళంగా మారింది. పురుషులు, మహిళలకు వేర్వేరుగా ఓపీ రిజిస్ట్రేషన్లు చేసేందుకు ఏర్పాట్లు చేసినా రద్దీ ఎక్కువగా ఉండడంతో చాలా మందికి అవస్థలు తప్పలేదు.

గోకవరంలో ఘనంగా ఎలక్ట్రీషియన్ డే



థామస్ అల్వా ఎడిసన్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎలక్ట్రీషియన్లు

గోకవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో యునైటెడ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ పాలూరు బోస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ బల్బును కనుగొన్న థామస్ ఆల్వా ఎడిసన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎలక్ట్రీషియన్ డేగా పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్యవర్గ సభ్యులు, ఎలక్ట్రీషియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


ధాన్యం డబ్బులు ఇప్పించండి మహాప్రభో...!



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

గోకవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా కేంద్రం ద్వారా విక్ర యించిన ధాన్యానికి సంబంధించి డబ్బులు ఇప్పించాలని తహశీల్దార్ సాయి ప్రసాద్‌ను సోమవారం రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తిరుమలయపాలెం రెవెన్యూ పరిధిలోని గంగంపాలెం రైతుభరోసా కేంద్రం ద్వారా 1200 క్వింటాలు విక్రయిం చామన్నారు. గత నెల 18న ధాన్యం విక్రయించామని, ఇప్పటికీ డబ్బులు జమ కాలేదని వాపోయారు. ఇకనైనా తగుచర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను కోరారు.

31 వరకు ఉచిత పశువైద్యశిబిరాలు




అరికిరేవులలో పాడి రైతులకు మందులు అందిస్తున్న కూటమి నేతలు

బిక్కవోలు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల కోసం రాష్ట్రప్రభుత్వం ఈనెల 20వ తేదీ నుంచి 31 వరకు ఉచిత పశు వైద్యశిబిరాలను నిర్వహిస్తోందని మండల పశు వైద్యాధికారి ప్రణీత్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం అరికిరేవులలో పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో మొత్తం 25 దూడలకు పాముల మందు, 20 పశువులకు వివిధ రకాల చికిత్సలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి, ఎంపీటీసీ కొర్ల చక్రధరరావు, రెడ్డి శ్రీను, డాక్టర్ వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అనంతవరం నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ అనే విద్యార్థి మరణానికి కారణమైన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, విద్యాసంస్థలను సీజ్ చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం రాజమహేంద్రవరంలోని ఇంటర్మీడియట్ ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్‌జేడీకి వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై.భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కనక, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు కె.భాను ప్రసాద్, సిటీ కార్యదర్శి దినేష్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





నేడే అక్షరం అండగా..

రాజమండ్రి 9వ డివిజన్‌లో నిర్వహణ

మా అక్షరం..మీ ఆయుధం.. ఇదే ఆంధ్రజ్యోతి నినాదం.. ఆ అక్షరంతోనే జనం చెంతకు వస్తోంది.. ఇప్పటి వరకూ అక్షరంతో జనగళమై ఆంధ్రజ్యోతి ప్రశ్నించింది. ఇప్పుడు స్థానిక సమస్యలపై జనవాణి వినిపించేందుకు మంగళవారం నుంచి తొలి అడుగువేస్తున్నది.. రండి..చేయి కలపండి.. సమస్యలు చెప్పండి!

రాజమహేంద్రవరం సిటీజనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా అనే నినాదంతో మంగళవారం జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం 9వ డివిజన్ వెంకటేశ్వర నగర్ ఐఎంఏ హాలులో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు.ఆ ప్రాంత కీలక సమస్యలపై ప్రజలు..ప్రజాప్రతినిధులు.. అధికారుల మధ్య వారధిగా ఆంధ్రజ్యోతి ఉంటుంది. దీనిలో భాగంగా ఆయా ప్రాంత సమస్యలపై చర్చిస్తారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కార్పొరేషన్ ఎస్ఈ జి.పాండురంగారావు,మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్నమాజీ కార్పొరేటర్ కోసూరి చండీప్రియ, ఈఈ, డీఈలు, శానిటేషన్ అధికారులు వార్డుకు చెందిన ముఖ్యనాయకులు హాజరవుతారు. డివిజన్ పరిధిలో ఇప్పటికే కొన్ని కీలక సమస్యలపై ప్రజలు గళం విప్పుతున్నారు.ప్రధానంగా రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, అపారిశుధ్యం తదితర 9 సమస్యలు ఉన్నాయని గుర్తించారు.మంగళవారం నిర్వహించనున్న సమావేశంలో ఆ డివిజన్‌కు చెందిన ప్రజలు వారి ప్రాంతంలో ఉన్న సమస్యలను ఆంధ్రజ్యోతి ద్వారా ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళతారు. ఆయా సమస్యల పరిష్కారంపై ప్రజాప్రతినిధులు,అధికారుల నుంచి సభావేదిక ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

గోదాట్లో దోపిడీ



కపిలేశ్వరపురం ఓపెన్ రీచ్‌లో పట్టపగలే యంత్రాలతో ఇసుక తవ్వకం

ఇసుక తవ్వేయ్..దోచెయ్



- రాత్రయినా ఆగని రవాణా
- కపిలేశ్వరపురంలో యంత్రాలు
- ధవళేశ్వరం గాయత్రీలో డ్రెడ్జింగ్
- విజ్జేశ్వరం వద్ద రాత్రి తవ్వకాలు
- రెచ్చిపోతున్న కూటమి నేతలు
- ఉచిత ఇసుక విధానానికి తూట్లు
- కన్నెత్తి చూడని అధికారులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉచిత ఇసుక విధానానికి కూటమికి చెందిన వారే తూట్లు పొడుస్తున్నారు.. ఇసుకాసురులతో కుమ్మక్కై రూ.కోట్లు దోచేస్తున్నారు. అధికార యంత్రాంగం ఎంత కట్టడి చేయాలనుకున్నా ఎంత మంది మీద కేసులు పెట్టినా ర్యాంపుల కాంట్రాక్టులే రద్దు చేసినా దోపిడీ ఆగడం లేదు. గోదావరి పరీవాహక ప్రాంతం ఉన్న తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోనూ దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది.

గాయత్రిలో భారీ డ్రెడ్జింగ్

అఖండగోదావరిలో అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో భారీ డ్రెడ్జింగ్ పడవలను ఉపయోగించి డ్రెడ్జింగ్ చేసి ఒడ్డున పెద్దపెద్ద ఇసుక పోగులు పెట్టి పగటి పూట దర్జాగా విక్రయించుకుంటున్నారు. గాయత్రి ర్యాంపుల్లో ఏటి గట్టు మీద ఉన్న కనకదుర్గమ్మ గుడికి కొద్ది సమీపంలో తుమ్మ డొంకల సమీపంలో గోదావరి పాయలో అనేక పెద్దపెద్ద పడవలను దాచిపెట్టారు. వీటితో రాత్రి వేళలో డ్రెడ్జింగ్ చేసి పగటిపూట ఎవరికీ కనబడకుండా యంత్రాలను దాచేస్తున్నారు. ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయాలకు కొద్ది కిలోమీటర్ల దూరంలోనే ఈ ర్యాంపులు ఉన్నప్పటికీ ఇరిగేషన్ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ఇదేమీ తమకు తెలియనట్టే వ్యవహరించడం గమనార్హం. ఆదివారం సాయంత్రం డ్రెడ్జింగ్ బోట్లను ఇసుక డ్రెడ్జింగ్‌కు సిద్ధం చేస్తున్న దృశ్యం ఆంధ్రజ్యోతి కంట పడింది. కోటి లింగాలరేవు,కొవ్వూరు నుంచి తాళ్లపూడి వైపు రాత్రి వేళల్లో భారీగా డ్రెడ్జింగ్ జరుగుతుంది.అధికారులు పగటిపూట వెళ్లి తనిఖీ చేసి ఈ డ్రెడ్జింగ్ యంత్రాలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టు కోవచ్చు. ఇక్కడ కేవలం బోట్స్‌మన్ సొసైటీలు మాత్రమే ఇసుక తీయాలి. కానీ అనుమతులు లేకుండా ఎన్జీటీ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక దోపిడీ చేయడం గమనార్హం.

రాత్రిపగలూ దోపిడీ..

ఇప్పటి వరకూ రాజమహేంద్రవరం అఖండ గోదావరి ఇసుక ఆధారం.. ఇటీవల కపిలేశ్వరపురం, తాతపూడి, ఊబలంక, వద్దిపర్రు, పొడగట్లపల్లి, నార్కెడిమిల్లి ర్యాంపులు తెరుచుకున్నాయి.ముఖ్యంగా జొన్నాడ సమీపంలోని కపిలేశ్వరపురంలో రోజుకు 250 నుంచి 300 లారీల ఇసుక తరలిస్తున్నారు.ఇక్కడ టన్ను ఇసుక కేవలం రూ.50కే సరఫరా చేస్తామని టెండర్లు దక్కించుకున్నారు.యంత్రాలు వినియోగించకూడదనే నిబంధన ఉంది.అయినా ఎక్కడా భయం లేదు. ఆరు యంత్రాలు పెట్టి రాత్రిళ్లు దర్జాగా తవ్వేసి రవాణా చేస్తున్నారు.కాకినాడ వైపు లారీలు వెళుతున్నట్టు స్థానికుల కథనం.టెండర్ నిరయించిన ధర ప్రకారం టన్నుకు కేవలం రూ.50 మాత్రమే తీసుకోవాలి.అంటే 20 టన్నుల ఇసుకకు కేవలం రూ.1000 మాత్రమే ర్యాంపులో వసూలు చేయాలి.రవాణా చార్జీలు వేరేగా ఉంటాయి.కానీ ర్యాంపులోనే రూ.6 వేల నుంచి రూ.9 వేలు వసూలు చేయడం గమనార్హం. ఇప్పటికే సీఎంవో వరకూ ఫిర్యాదులు వెళ్లినట్టు తెలిసింది. దోపిడీ మాత్రం ఆగడం లేదు.

ఉచిత ఇసుక అడ్డగింత..

ఇసుకాసురులు ఉచిత ఇసుక ఇవ్వడానికి ఒప్పుకోవడం లేదు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ట్రాక్టర్లు, ఎండ్ల బండ్ల మీద గ్రామానికి చెందిన ఎవరైనా ఇసుకను ఉచితంగా తీసుకుని వెళ్లవచ్చు. ఇసుకాసురులు రకరకాల ఎత్తుగడలతో ట్రాక్టర్లు,ఎండ్ల బండ్లను కూడా దరి చేరనీయడం లేదు.ఎవరైనా ట్రాక్టర్,బండితోనూ ఉచిత ఇసుక కోసం ర్యాంపులోకి వచ్చే ప్రయత్నం చేస్తుంటే వాటికి అడ్డంగా లారీలను పెట్టేస్తున్నారు. దీంతో మొత్తం ఉచిత ఇసుక విధానం ధ్వంసమైంది. కాకినాడ స్టాక్ పాయింట్లకు కూడా ఇసుక రవాణా చేయడం లేదు. దీంతో ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం విమర్శలకు తావిస్తోంది.

విజ్జేశ్వరంలోనూ యథేచ్ఛగా..

నిడదవోలు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అఖండ గోదావరి పరీవాహక ప్రాంతంలో రాత్రయితే చాలు దొంగలు పడుతున్నారు.. ఇసుకను దోచేస్తున్నారు. గోదారమ్మ గుండెలను పిండేలా అర్ధరాత్రి వేళ ఇసుక మాఫియా విజృంభిస్తుంది. జిల్లాలోని విజ్జే శ్వరం బ్యారేజ్ సమీపంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు విజ్జేశ్వరం గోదావరి నుంచి ఇసుకాసురులు ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు. బ్యారేజీకి ముప్పు వాటిల్లేలా ఇసుకను అక్రమంగా తవ్వేస్తున్నారు.ఒక ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన ముఖ్య నాయకుడి వ్యక్తిగత సహాయకుడి అండదండలతో ముఖ్య నాయకులు ఇద్దరు అక్రమ ఇసుక వ్యాపారాన్ని సాగిస్తున్నట్టు సమాచారం.అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకుండా వ్యక్తిగత సహాయకుడు కట్టడి చేస్తున్నాడు. సంక్రాంతి పండగ నుంచి నిన్నటి వరకు నిడదవోలు మండలం విజ్జేశ్వరం, పందలపర్రు ర్యాంపుల్లో నిర్వాహకులు, కార్మికులకు మధ్య సఖ్యత కుదరని కారణంగా ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి.ఇదే అదునుగా విజ్జేశ్వరంలో ఇసుక మాఫియా విజృంభించేసింది.ఆరు లారీలు,మూడు ట్రాక్టర్లుగా రాజకీయ పార్టీ పట్టణ,మండల ముఖ్య నాయకులు ఇద్దరూ ఒక్కటై దబ్బులు దండుకుంటున్నారు.విజ్జేశ్వరం ఇసుక మాఫియాపై అధికారులకు సమాచారం వెళుతున్నా స్పందించడంలేదు. ముఖ్యనాయకుడి అనుచరులే అక్రమ ఇసుక వ్యాపారానికి తెరలేపడం చర్చనీయాంశంగా మారింది.మూడు రోజుల కిందట విజ్జేశ్వరంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును వీఆర్‌వో ఫిర్యాదు మేరకు సమిశ్రగూడెం ఎస్ఐ వీరబాబు ఆధ్వర్యంలో సీజ్ చేసి కేసు నమోదు చేశారు.



ఫిబ్రవరిలో సీఎం చంద్రబాబు రాక?

రాజమహేంద్రవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చే నెల మొదటి వారంలో జిల్లాకు రానున్నారు. ఇప్పటికే నిర్మించిన ఇళ్ల గృహ ప్రవేశాలకు శ్రీకారం చుట్టనున్నారు. సభ కూడా జరగవచ్చు. అధికారికంగా ఖరారు కావలసి ఉంది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో ఏదో ఒక చోట కచ్చితంగా వచ్చే నెల మొదటి సీఎం ప్రోగ్రాం ఉండవచ్చనేది సమాచారం.ఈ మేరకు జిల్లా యంత్రాంగానికి సమాచారం అందింది.ఎప్పుడు ఎక్కడ అనేది ఒకట్రెండు రోజుల్లో ఖరారు కావొచ్చు.ఇప్పటికే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.వాస్తవానికి ఫిబ్రవరి 1న పశ్చిమగోదావరి జిల్లా తణుకులో సీఎం చంద్రబాబు పర్యటించాల్సి ఉంది.అయితే అనివార్య కారణాల వల్ల రద్దయినట్టు సమాచారం. ఇదిలా ఉండగా రాష్ట గృహ నిర్మాణ శాఖ ఎండీ మంగళవారం జిల్లాలో గృహ నిర్మాణాలు జరిగే ప్రాంతాల్లో పర్యటించనున్నారు.



చంద్రబాబుకు నల్లమిల్లి ఆహ్వానం

అనపర్తి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : తన కుమారుడు మనోజ్‌రెడ్డి వివాహానికి హాజరు కావాలని కోరుతూ అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం ఉండవల్లి ముఖ్యమంత్రి నివాసంలో చంద్రబాబును కలిసి ఆహ్వాన ప్రత్రిక అందజేశారు. వచ్చే నెల 8వ తేదీన హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ విష్పర్ వ్యాలీలో పెళ్లి జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట తల్లి సత్యవతి, సతీమణి మహాలక్ష్మి, నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, డాక్టర్ నల్లమిల్లి సనాతని తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాల్లో వెనుకబడితే..
సిబ్బంది జీతాలు ఆపండి!

- గృహ నిర్మాణ లక్ష్యాలు చేరాల్సిందే
- 4 మండలాల అధికారులపై ఆగ్రహం
- మార్చికి 3823 ఇళ్లు పూర్తికావాలి
- 1879 యూనిట్లకు రుణ సౌకర్యం
- హౌసింగ్‌పై కలెక్టర్ ప్రశాంతి సమీక్ష

రాజమహేంద్రవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గృహ నిర్మాణాలు వెనుకబడిన ప్రాంతాల్లో సిబ్బంది జీతాలు నిలిపివేయాలని.. పనితీరు ఆధారంగానే జీతాలివ్వాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాల పరిస్థితితో పాటు స్వర్ణాంధ్ర మిషన్ నెలవారీ కార్యక్రమాలపై సోమవారం ఆమె సమీక్షించారు. గృహ నిర్మాణాల్లో హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణ లక్ష్యాలు చేరడంలో వెనకబడి ఉన్న కొవ్వూరు, అనపర్తి, చాగల్లు, సీతానగరం మండలాల అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గతం కంటే మెరుగుపడినట్టు సంబంధిత అధికారులు చెప్పారు. గృహ నిర్మాణాలు ఎప్పటిలోగా పూర్తవుతాయని ప్రశ్నించారు. నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతం చేయాలని సూచించారు. ఫిబ్రవరి మొదటి వారంలో ప్రజా ప్రతినిధుల సమక్షంలో గృహ ప్రవేశాలు వేడుకగా నిర్వహించాలన్నారు. మార్చి నాటికి 3823 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికి కేవలం 435 మాత్రమే పూర్తి చేశారన్నారు. జిల్లాలో పల్లెపండుగ ద్వారా చేపట్టిన 667 సీసీ రోడ్లలో 493 రోడ్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. మినీ డెయిరీ యూనిట్ల స్థాపనకు ఆయా కార్పొరేషన్ల వారీ లబ్ధిదారులను ఎంపిక చేయాలని చెప్పారు. బీసీ యాక్షన్ ప్లాన్ కింద రూ.52.46 కోట్లతో 1879 యూనిట్లకు సంబంధించి మూడు పట్టణ,10 మండలాల్లో సభ్యులకు రుణ సౌకర్యం కల్పించాలన్నారు.అంగన్వాడీల్లో 78 డ్రింకింగ్ యూనిట్లలో 75 యూనిట్లు పూర్తి చేసి, 173 టాయిలెట్లలో 166 పూర్తి చేసిన వారిని జేసీ ఎస్.చిన్నరాముడు అభినందించారు.సమావేశంలో డీఆర్వో టీసీ తారామమూర్తి,డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, ఐసీడీఎస్ విజయకుమార్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలు పెండింగ్ పెట్టొద్దు

కొవ్వూరులో 30 అర్జీలు స్వీకరించిన కలెక్టర్ ప్రశాంతి



పేదల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులు రీఓపెన్ కాకుండా జవాబుదారీతనంతో పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజనల్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె ప్రజల నుంచి 30 అర్జీలు స్వీకరించారు. మండలస్థాయి అధికారులు అందరూ ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉండి ఫిర్యాదులు పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం అవసరమన్నారు.జేసీ ఎస్.చిన్నరాముడు మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కొవ్వూరు పట్టణానికి చెందిన కె.బి.బిఆర్ఎస్ ఫణికుమార్ రోడ్డు కం రైలు వంతెనపై భారీ వాహనాలు వెళ్లకుండా గడ్డర్లు వేయడంతో ఎక్స్‌ప్రెస్ బస్సులు కొవ్వూరు పట్టణంలోకి రాకుండా గామన్ వంతెన మీదుగా వెళ్లిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. దేవరపల్లి మండలం అచ్యుయ్యపాలెంకు చెం దిన నీరుకొండ నాగదేవి వ్యవసాయం చేసుకోవడానికి నీటి సదుపాయం కల్పించాలని కోరారు. తాళ్లపూడి మండలం బయ్యవరం గ్రామానికి చెందిన ఉండవల్లి వెంకటలక్ష్మి తన పేరున ఉన్న భూమి ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదైందని సరిచేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ జి. దేవకుమార్, డీఎల్‌డీవో ఎ.స్వీవారెడ్డి, డివిజనల్, మండల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో 136 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో 136 అర్జీలు స్వీకరించారు. డీఆర్‌వో టి.సీతారామమూర్తి సోమవారం ఉదయం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖ, డీఆర్‌డీఏ, పింఛన్లు, మునిసిపాలిటీలో పౌరసేవలు, జీఎస్‌డబ్ల్యు సేవలు, వైద్యశాఖ, దివ్యాంగ పెన్షన్, విద్యుత్ శాఖ సమస్యలపై అర్జీలు స్వీకరించారు.



పెద్దాసుపత్రికి వచ్చినా..
2 గంటలు ఆటోలోనే!

జీటీజీహెచ్‌లో వీల్‌చైర్, స్ట్రెచర్ అందుబాటులో లేక ఇక్కట్లు

రాజమహేంద్రవరం అర్బన్,జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధన సమగ్ర ఆసుపత్రి (జీటీజీహెచ్)కి వచ్చే రోగులకు ఆసుపత్రి అధికారుల నుంచి కనీస సహాయం అందడంలేదు. మంచం మీద నుంచి లేవలేని రోగులను వారి కుటుంబీకులు ఆటోల్లోనో, ఇతర ప్రైవేట్ వాహనాల్లోనో ఆసుపత్రి వరకూ తీసుకొస్తున్నా వారిని డాక్టర్ వద్దకు తీసుకెళ్లేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుంది. సోమవారం ఉదయం పదిన్నర గంటల సమయంలో సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామానికి చెందిన ఏలూరి పోసియ్యను నడవలేని స్థితిలో అతడి కుటుంబీకులు ఆటోలో ఆసుపత్రికి తీసుకొచ్చారు. అతడిని డాక్టర్ వద్దకు తీసుకెళ్లడానికి వీల్‌చైర్ అవసరం పడింది. వీల్‌చైర్ దొరికితే అందులో కూర్చోబెట్టుకుని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లేందుకు అతని భార్య, కుమారుడు,దగ్గరి బంధువు ఒకరు ఆసుపత్రి అంతా కలియతిరిగారు. ఎక్కడా వీల్‌చైర్ కనిపించలేదు. ఇలా సుమారు రెండు గంటలసేపు పోసియ్య ఓపీ బ్లాకు ఎదురుగా ఆటోలోనే ఎదురు తెన్నులు చూడాల్సి వచ్చింది. చివరకు కుటుంబీకులు ఎలాగోలా వీల్‌చైర్ సంపాదించి పోసియ్యను డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. జీటీజీహెచ్ వద్ద ఇటువంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి.వందలాదిగా సిబ్బంది ఉన్నా సేవలకు ఒక్కరు ముందుకు రాకపోవడం గమనార్హం.

ఇలాంటి ఘటనలు నిత్యకృత్యం..

ఎమర్జెన్సీ కేసులు వచ్చే ప్రధాన ఎంట్రన్స్‌తో పాటు క్యాజువాలిటీ విభాగాల వద్ద వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉండడంలేదు. అసలు ఆసుపత్రిలో ఎన్ని వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉన్నాయి, ఏయే వార్డుల్లో ఎన్ని ఉపయోగిస్తున్నారు అనే లెక్కలు ఆసుపత్రి ఉన్నతాధికారుల వద్ద ఉన్నాయా లేదా అనేది కూడా అనుమానమే.ఆసుపత్రి అధికారులకు ఈ సమస్య చాలా చిన్నదిగా కనిపిస్తున్నా రోగులు, వారి కుటుంబీకుల కోణంలో నుంచి చూస్తే సమస్య ఎంత తీవ్రమైందో అర్థమవుతుందనే వాదన ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల నుంచి వినిపిస్తోంది.ఈ సమస్యపై జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించాలని అత్యవసర వైద్యానికి వచ్చే బాధిత ప్రజలు కోరుతున్నారు.

కాకరపర్రు పట్టా భూముల రికార్డులు పరిశీలన

రేషన్ డీలర్ల భర్తీ ఇంటర్వ్యూలు వాయిదా

30న జాబ్‌మేళా

8

మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన జీటీజీహెచ్ స్పెషలాఫీసర్



రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీటీజీహెచ్) స్పెషలాఫీసర్ భాస్కరరెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. నడవలేని స్థితిలో ఉన్న రోగులు, దివ్యాంగులకు అవసరమైన వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉండాలని ఆర్ఎంవోకు సూచించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రిని సోమవారం సందర్శించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఆసుపత్రిలోని ప్రధాన భవనం మెయిన్ ఎంట్రన్స్ వద్ద ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ముందుగా ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు.వైద్యుల పనితీరు, ఆరోగ్యశ్రీ వైద్యసేవలు, రోగులకు అందుతున్న ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. వీల్‌చైర్లు, స్ట్రెచర్లు ఎన్ని ఉన్నాయి.కొత్తగా ఎన్ని వస్తున్నాయి.. ఇటీవల జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ప్రతిపాదనలు ఉంచారా లేదా అనే వివరాలను ఆర్ఎంవోను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బంది లేకుండా వైద్యసేవలు అందజేయాలని ఆయన సూచించారు.

అంతా బాగున్నారా!

ఏం బాబు ఎలా ఉన్నారు.. బాగున్నారా.. అంతా కులాశాయేనా.. మిమ్మల్ని కలిసి చాలాకాలమైందని ఇలా వచ్చా.. సమస్యలు ఏమైనా ఉన్నాయా చెప్పండి అంటూ.. సీనియర్ నాయకుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి సోమవారం బైక్‌పై కడియం మండలంలో కలియతిరిగారు.. కనిపించిన వారిని పలకరించుకుంటూ సాయంత్రం వరకూ అక్కడే గడిపారు.. పలు చోట్ల సమస్యలు విన్నారు.. టీడీపీ మండల అధ్యక్షుడు వెలుగుబంటి నాని బైక్ నడుపుతుండగా ఎమ్మెల్యే గోరంట్ల వెనుక కూర్చుని కడియం దేవీచౌక్ సెంటర్ నుంచి పడాల వారివీధి, చల్లా వారి వీధి, శెట్టిబలిజపేట, రామాలయం మీదుగా పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన వెంట ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ తదితరులు ఉన్నారు. - కడియం



హాస్టళ్లకు రూ.3.78 కోట్లు

సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి

దేవరపల్లి,జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హాస్టళ్ల మరమ్మతులకు రూ.3.78 కోట్లు నిధులు మంజూరయ్యాయని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి తెలిపారు.దేవరపల్లి మండలం గౌరీపట్నం, దుద్దుకూరు, చిన్నాయి గూడెం, యర్నగూడెం గ్రామాల్లో హాస్టళ్లను సోమవారం పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో ఉన్న 24 హాస్టళ్లలో 1800 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న హాస్టళ్లను తొలగించి కొత్తభవనాలు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు.గోపాలపురం నియోజకవర్గంలో ఆరు హాస్టళ్లు పూర్తిగా శిథిలమయ్యాయని చెప్పారు.నియోజకవర్గంలో హాస్టళ్ల సిబ్బంది కొరత ఉందని జూన్ కల్లా భర్తీ చేస్తామన్నారు. విద్యార్థులకు కాస్మోటిక్స్ బకాయిలు వెంటనే నిధులు విడుదల చేస్తామన్నారు.జిల్లాలోని 180 మంది పదవ తరగతి విద్యార్థులకు ట్యూషన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు రాజమండ్రి రైట్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. పరమేశ్వర బయోటెక్, 3ఎఫ్ ఆయిల్ పామ్,ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీల యజమానులు హాస్టళ్ల నిర్మాణానికి దాతలు ముందుకు రావడం జరిగిందన్నారు. ఆమె వెంట ఏఎస్‌డబ్ల్యూవో ఆర్‌వీ.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



గౌరీపట్నంలో హాస్టల్ అధికారులతో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి

పట్టా భూముల రికార్డులు పరిశీలన



కాకరపర్రులో బి పట్టా భూములకు సంబంధించి రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పెరవలి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కాకరపర్రు గోదావరి లంక భూముల్లోని బి పట్టా భూములు, వారసత్వ పట్టాల కోసం పలువురు దరఖాస్తులు చేయడంతో కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఆ సర్వే నెంబర్‌లో ఉన్న భూముల్లో వాస్తవంగా ఎవరు సాగు చేస్తున్నారో క్షేత్ర స్థాయిలో పరిశీలించి వారి వివరాలపై నివేదిక అందజేయాలని మండల తహసీల్దార్ అచ్యుత కుమారిని ఆదేశించారు. 1970లో తమ తాత, ముత్తాతలకు పట్టాలు ఇచ్చారని అప్పటి నుంచి పూర్వీకుల పేరు మీదనే పట్టాలు ఉన్నప్పటికీ భూములను సాగు చేసుకుంటున్నామని గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు పేర్కొన్నారు. వరదలు, తుఫాన్‌ల వల్ల వచ్చే నష్ట పరిహారాలు రావడం లేదని అందువల్ల ఆ భూములను తమ పేరు పై మార్చి పట్టాలు ఇవ్వాలన్నారు. దీనిపై స్థానికంగా పరిశీలించి సమగ్ర నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, జిల్లా మైన్స్ అధికారి ఫణి భూషణ్ రెడ్డి, జిల్లా సర్వే అధికారి లక్ష్మీనారాయణ, స్థానిక వీఆర్వో మమతా, ఆర్ఐ పావని తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా ఏపీ : పురందేశ్వరి

చాగల్లు, జనవరి 27, (ఆంధ్రజ్యోతి): అక్షర క్రమంలోనే కాదు అభివృద్ధిలో సైతం ఆంధ్ర ప్రదేశ్ అగ్రగామిగా ఉంచేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తుందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. చాగల్లులో మండలంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన సందర్భంగా అనేక పథకాలకు శంకుస్థాపన చేశారన్నారు. అనంతరం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాదెళ్ళ శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కూటమి నాయకులు కరుటూరి సతీష్, కేతా సాహెబ్, వి.నాగేంద్ర, తాళ్లూరి వరప్రసాద్, ఉప్పులూరి వీరేంద్ర, కొప్పాక విజయకుమార్, ఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన వైసీపీ

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ తీస్తానని చెప్పి గత ప్రభుత్వం యువతను మోసం చేసిందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. యువగళం పాదయాత్ర ప్రారంభమై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా టీడీపీ కొవ్వూరు నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం కేక్ కట్‌చేసి వేడుకలు జరిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు యువతకు అందించాలని ముందుకు సాగుతున్నారన్నారు. కొవ్వూరులో 30 కంపెనీలను తీసుకువచ్చి మెగా జాబ్‌మేళా నిర్వహించి 800 మందికి ఉద్యోగాలు అందించామన్నారు. ఈ నెల 30న కొవ్వూరు డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, వట్టికూటి వెంకటేశ్వరరావు, నాదెళ్ళ శ్రీరామ్, అర్దిల్లి రామకృష్ణ, తుంపల్లి ఆదినారాయణ, కె. బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర వసతిగృహం పరిశీలన



పెద్దగూడెంలో ఎస్సీ బాలుర వసతిగృహాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి

గోపాలపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గతంలో నిర్మించి భవన సముదాయాలు, శిథిలమైన వాటిని యుద్ధ ప్రతిపాదికన పునరుద్ధరిస్తామని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంఎస్.శోభారాణి అన్నారు. మండలంలోని పెద్దగూడెం, రాజంపాలెం, రేగులకుంట గ్రామాల్లో సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహాలను సోమవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ శిథిలమైన వసతిగృహాలను పునర్దురించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. పెద్దగూడెం, రాజంపాలెం, రేగులకుంట వసతిగృహాల మరమ్మతులకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి వచ్చినట్లు తెలిపారు. ఆమె వెంట పీఆర్‌డీఈ వెంకటలక్ష్మి, ఏఎస్‌డబ్ల్యూఓ ఆర్‌వీ.శ్రీనివాస్, డీఆర్ ఏఈ పవన్‌కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.



చీపురుగూడెంలో గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలు పంపిణీ చేస్తున్న ఏసీడీపీవో పద్మావతి

సేంద్రియ కూరగాయలు

ఆరోగ్యానికి దోహదం

నల్లజర్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతుల్లో పండించిన కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని గోపాలపురం ఏసీడీపీవో పద్మావతి అన్నారు. సోమవారం చీపురుగూడెం కోడ్ నెంబరు 55, 56 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆకుకూరలను గర్భిణీలు, బాలింతలకు అందించారు. ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో గర్భిణులు, బాలింతలకు ఆయా అంగన్‌వాడీ పరిధిలో 10 సెంట్ల భూమి కేటాయించి సేంద్రియ పద్ధతుల్లో ఆకు కూరలు పండించి వారికి అందిస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, సర్పంచ్ గాలింకి మాల్లిక, టీడీపీ అధ్యక్షులు చెల్లు పెద్దరామన్న, కూసంపూడి వెంకటేశ్వరరావు, జనసేన మండల కార్యదర్శి చెల్లు సత్యనారాయణ, గాలింకి రాంబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

లక్షల డప్పుల సభకు తరలిరండి

ఉండ్రాజవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న జరిగే లక్షల డప్పుల వేల గొంతులు సన్నాహక సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి బయ్యారపు రాజేశ్వరరావు కోరారు. ఉండ్రాజవరంలో జరిగిన ఎంఆర్‌పీఎస్ మండల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిద్దే మధుబాబు, నిడదవోలు నియోజవర్గ ఇన్‌ఛార్జి గాలింకి రాము, ఎమ్ఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు, న్యాయవాది బొల్లిపో సునిల్‌రాజ్, ప్రధాన కార్యదర్శి మండవల్లి అనిల్‌కుమార్, తణుకు నియోజకవర్గ నాయకులు చదలవాడ నాని, మాజీ సర్పంచ్ దూలవల్లి జయరాజ్, నాయకులు గాలింకి సంతోష్, సతీష్‌కుమార్, ప్రసాద్, రత్నరాజు, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

రేషన్ డీలర్ల ఇంటర్వ్యూలు వాయిదా

కొవ్వూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న చౌకడిపో డీలర్ల ఖాళీల భర్తీకి ఈ నెల 28న నిర్వహించవలసిన ఇంటర్వ్యూలు 7 రోజులు వాయిదా వేసినట్లు కొవ్వూరు ఆర్డీవో డాక్టర్ రాణి సుస్మిత తెలిపారు. ఇంటర్వ్యూలు తిరిగి ఎప్పుడు నిర్వహించేది ఏడు రోజుల తరువాత ప్రకటిస్తామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టాలి

• ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు • 2025-26 సంవత్సరానికి బడ్జెట్ ఆమోదం



మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు. పాల్గొన్న కౌన్సిలర్లు

కొవ్వూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాగునీరు అందించడంలో రాజీపడవద్దని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన సోమవారం మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాగునీటి సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, దోమల నివారణలో రాజీపడవద్దన్నారు. కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.2.50 లక్షలు, డ్వాక్రా మహిళలకు బ్యాంకు రుణం రూ. లక్ష అందిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం పట్టణంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల చొప్పన ఇళ్ల స్థలాలు అందించడానికి కేబినెట్ ఆమోదించిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ సూరపనేని సూర్యభాస్కర రామ్మోహన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పట్టణ శివారు ప్రాంతాలలో లేఅవుట్‌లు ఇవ్వడంతో పారిశుధ్యం నిర్వహణ సమస్యగా మారిందన్నారు. 16వ వార్డు కౌన్సిలర్ కండెల్లి రామారావు మాట్లాడుతూ ఔరంగాబాద్‌లో డ్రైనేజీలు నిండిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 7వ వార్డు కౌన్సిలర్ పాలూరి నీలిమ మాట్లాడుతూ దోమలు పెరిగిపోయాయని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కోఆప్షన్ సభ్యుడు ఏలూరి వెంకట్ మాట్లాడుతూ మున్సిపాల్టీ వాహనాల మరమ్మతులకు సంబంధించి మెకానిక్‌ను, వాటర్‌వర్క్సులో మోటార్ల రిపేర్లు చేయడానికి ఒక మెకానిక్‌ను తీసుకోవాలని సూచించారు. కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో తాగునీటి సరఫరాకు సంబంధించి ఏడాదికి రూ.2 కోట్లు ఖర్చు అవుతోందన్నారు. కుళాయి కనెక్షన్ల ద్వారా రూ.50 లక్షలు మాత్రమే ఆదాయం వస్తున్నదన్నారు. దీంతో పురపాలక సంఘంపై ఆర్థిక భారం పడుతోందన్నారు. కుళాయి కనెక్షన్‌కు నెలకు రూ.100 నుంచి 120కి, మీటరు కనెక్షన్ ఉన్న కుళాయిలకు నెలకు రూ.40 నుంచి 60కి పెంచడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వైసీపీ, టీడీపీ కౌన్సిలర్లు కోడూరి శివరామకృష్ణ, వైస్ చైర్మన్ మన్నె పద్మ, సూరపనేని చిన్ని, కంటమణి రమేష్, బత్తి నాగరాజు, పిల్లలమర్రి మురళీకృష్ణ పలు అంశాలపై సుమారు గంటకు పైగా చర్చించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ సర్క్యులేషన్ నెట్‌వర్క్ ప్లాన్‌లు ఆమోదం పొందితే ప్రజలకు మంచి జరుగుతుందని తెలపడంతో కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

2025-26 ఏడాదికి మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

కొవ్వూరు పురపాలక సంఘం 2024-25 సంవత్సరానికి సవరించిన బడ్జెట్, 2025-26 సంవత్సరానికి బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ ఆమోదించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి తెలిపారు. 2024-25 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ రూ.16,74,26,799 ప్రారంభ నిల్వగా చూపించారు. రాబడులు రూ. 11,93,88,019, ఖర్చులు రూ. 19,64,25,000, మిగులు బడ్జెట్ రూ. 9,03,89,818లుగా చూపించారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ రూ.9,03,89,818 ప్రారంభ నిల్వగా చూపించారు. రాబడులు రూ. 15,68,88,000, ఖర్చులు రూ. 19,82,35,000, మిగులు బడ్జెట్ రూ.4,90,42,818 అంచనాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజలి, కోడూరి శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, కంటమణి రమేష్, పిల్లలమర్రి మురళీకృష్ణ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రజా దర్బార్‌కు ఫిర్యాదులు

కొవ్వూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బారులో మూడు ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. విద్యుత్ దీపాలు వెలిగించాలని, సత్యవతినగర్‌లో డ్రైనేజీలు నిర్మాణం చేపట్టాలని, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఈఎస్‌ఐ నిలుపుదల చేశారని, పునరుద్దరించాలని ఫిర్యాదులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

30న కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

కొవ్వూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 30న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ముత్తూట్ మైక్రో ఫైనాన్స్, మెడ్‌ప్లస్ ఫార్మసీ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. జాబ్‌మేళాలో పాల్గొనే విద్యార్థులు ఎస్ఎస్‌సి, డిగ్రీ, డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ అర్హత కలిగి ఉండాలన్నారు. జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థులు 30న ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు ఎం.పెరుమాళ్లరావు 73062 32373, 83175 44728 మొబైల్‌లో సంప్రదించాలన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పసలపూడి

తాళ్లపూడి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): లూయిస్ దాగురే ఫొటో, వీడియోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులుగా మరోసారి పసలపూడి ఆశీర్వాదం ఎన్నికయ్యారు. తాళ్లపూడిలో సోమవారం జరిగిన అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికల కార్యక్రమంలో అధ్యక్షులుగా ఆశీర్వాదం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జల్లేపల్లి శ్రీనివాస్, కార్యదర్శిగా పోతుల గిరీష్, కోశాధికారిగా గంగనకుర్తి వెంకటేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో దున్నా ఆశీ లు, నవీన్‌కుమార్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతో అధిక ప్రయోజనాలు

ఎలక్ట్రీషియన్ డే కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముప్పిడి, మద్దిపాటి



దేవరపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు. పక్క చిత్రంలో కొవ్వూరులో సీనియర్ ఎలక్ట్రీషియన్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

దేవరపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే ఆదాయం పెరుగుతుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లిలో సోమవారం ఎలక్ట్రీషియన్స్ డే సందర్భంగా దేవరపల్లి మండల ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్ యూనియన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు హాజరై మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్స్ ప్లంబర్ సభ్యులకు ప్రభుత్వపరంగా వచ్చే పనులను ఈ యూనియన్‌కు అప్పగించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అండ్రూ అనీల్, టీడీపీ నాయకులు ఉప్పులూరి రాము, లంకా సత్యనారాయణ, శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ యూనియన్ నాయకులు బీఎస్ఆర్.కృష్ణ, బీ. రామకృష్ణ, బాబురావు, అంబటి వీరబాబు, ఓరుగంటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు(ఆంధ్రజ్యోతి): అందరి ఇళ్లలో వెలుగులు నింపేది ఎలక్ట్రీషియన్లు అని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు ప్రైవేటు ఎలక్ట్రికల్, ప్లంబింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్స్ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, మాజీ మున్సిపల్ సూర్యభాస్కర రామ్మోహన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్ బల్బు కనిపెట్టిన థామస్ ఆల్వా ఎడిసన్, ఇతర పటాలకు నివాళులర్పించారు. సీనియర్ ఎలక్ట్రీషియన్‌లను సత్కరించారు. ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ ఇళ్లులేని ఎలక్ట్రీషియన్లకు స్థలాల పంపిణీలో ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో జాగారపు వీరబాబు, ఎస్‌పీ వెంకన్న, దొంగల హరీష్‌కుమార్, జమ్ము సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి(ఆంధ్రజ్యోతి): మండల ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషన్స్ డేని నిర్వహించారు. దీనికి జిల్లా వర్కింగ్ అధ్యక్షులు గుమ్మడి చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు శీలబోయిన శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎలుబోలు శ్రీనివాస్, భీమరాజు, భాస్కరరావు, ప్రసాదు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రతో ఘన విజయం

నల్లజర్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ప్రజల సమస్యలను విని సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు అన్నారు. సోమవారం రాత్రి టీడీపీ నల్లజర్ల కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం జరిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేశ్ పాదయాత్ర 97 నియోజకవర్గాల్లో కొనసాగితే 90 నియోజకవర్గాల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్ దావోస్ పర్యటన విజయవంతం అయ్యిందన్నారు. ఎమ్మెల్సీ చిరంజీవి, టీడీపీ మండలాధ్యక్షులు తాతిన సత్యనారాయణ, యద్దనపూడి బ్రహ్మరాజు, వసుమర్తి రతీష్ పాల్గొన్నారు.



నిడదవోలులో మాసశివరాత్రికి ప్రత్యేక పూజలందుకున్న సోమేశ్వరస్వామి

సోమేశ్వరుడికి విశేష పూజలు

నిడదవోలు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నిడదవోలులో వున్న బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకుళపు లక్ష్మి నరసింహశాస్త్రి, అభిరామ్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు గణపతి పూజలు ఉపన్యాసక రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సోమాల శివ తెలిపారు.

దారవరంలో పశువైద్య శిబిరం



పశువైద్య శిబిరంలో రైతులకు మందులు, పశువుల దాణా ప్యాకెట్లు అందిస్తున్న దృశ్యం

చాగల్లు, జనవరి 27(ఆంధ్రజ్యోతి) మండలంలోని దారవరంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 64 పశువులకు, 38 లేగదూడలకు, 112 కోళ్లకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. లంపి చర్మ వ్యాధికి 42 ఆవులకు, 134 పశువులకు గొంతు వాపు నివారణకు, 120 జీవాలకు కొక్కెర వ్యాధి నివారణ టీకాలు వేశారు. గర్భకోశ వ్యాధులకి సంబంధించి 18, చూడు పరీక్షలు 13 వాటికి నిర్వహించారు. అధిక సంఖ్యలో పాడి రైతులు పాల్గొన్న ఈ శిబిరంలో టీడీపీ నాయకులు బొడ్డు రాజు, వెటర్నరీ అసిస్టెంట్ యు.ముఖేష్ తదితరుల నుంచి పశువులకు అవసరమైన మందులు, దాణ ఉచితంగా అందించారు.

చైతన్య స్కూల్ విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ జరుపుతున్న చైతన్య స్కూల్ విద్యార్థులు

దేవరపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో శ్రీచైతన్య పాఠశాలలో బేటీ సమ్మాన్ అనే స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం సందర్భంగా సోమవారం 8, 9 తరగతుల విద్యార్థులతో పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద మానవ హారం జరిపినట్లు చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ కిషోర్, వైస్ ప్రిన్సిపల్ అనురాధ తెలిపారు. ఆడపిల్లలకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం ద్వారా ఆత్మరక్షణ కల్పించాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్.రవికిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అచ్చన్నపాలెం సుబ్బారావు పెరట్లో పెరిగిన చెరకుగెడ

ఎంత పెద్ద చెరకుగడో

నల్లజర్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సాధారణంగా చెరకుగెడ 10 నుంచి 12 అడుగులు పెరుగుతుంది. అచ్చన్నపాలెంలోని కె.సుబ్బారావు ఇంటి పెరట్లో ఉన్న చెరకుగెడ దాదాపు 20 అడుగులకు పైగా ఎదిగి చూపరులను అబ్బురపరుస్తోంది. సారవంతమైన నేలతో పాటు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే తోటంతా ఇదే విధంగా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారి బి.సోమశేఖర్ తెలిపారు.

పౌష్టికాహారంతో లాభాలెన్నో...

నిడదవోలు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిగ్రస్తులు మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతులు కావచ్చునని ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఫయాజ్ అన్నారు. సోమవారం నిడదవోలులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో టీబీ వ్యాధిగ్రస్తులకు రీచ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు.

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొవ్వూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. సోమవారం కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో బ్రాహ్మణరేవు గోదావరి నదిలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి వయసు 35 నుంచి 40 మధ్య ఉంటుందన్నారు. ఆరికిరేవుల వీఆర్వో అందించిన ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.